ఋషి

ధర్మం కోసం అక్షర తపస్సు — తెలుగు దినపత్రిక

శనివారం
SATURDAY
7.12.2024
సంచిక: 108
సంపుటి: 16
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

శ్రీకృష్ణుడి మాట

స్వార్థం నీ వివేకాన్ని చంపేస్తుంది. స్వార్థపరుడు తన లాభాల కోసమే చూస్తాడు. ఇతరుల సంక్షేమం గురించి ఆలోచించడు. స్వార్థం వీడితేనే వివేకం చేరువవుతుంది.

ముహూర్తం

07 డిసెంబర్ 2024 - శనివారం శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:37 సూర్యాస్తమయం - సా. 5:37 తిథిజ షష్ఠి ఉ. 11:04 వరకు సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం ధనిష్ఠ సా. 4:39 వరకు యోగం వృద్ధిమతా ఉ. 8:36 వరకు కరణం తైతుల ఉ. 11:04 వరకు గరజి రా. 10:25 వరకు వర్జ్యం రా. 11:48 నుండి రా. 1:21 వరకు దుర్ముహూర్తం ఉ. 8:05 నుండి ఉ. 8:49 వరకు రాహుకాలం ఉ. 9:22 నుండి ఉ. 10:45 వరకు యమగండం మ. 1:30 నుండి మ. 2:52 వరకు గుళికాకాలం ఉ. 6:37 నుండి ఉ. 8:00 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:01 నుండి తె. 5:49 వరకు అమృత ఘడియలు ఉ. 6:38 నుండి ఉ. 8:12 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:45 నుండి మ. 12:29 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published From HYDERABAD || www.rhushinews.com facebook: rhushinews twitter: rhushinews instagram: rhushinews

పాలనలో..

రేవంత్ ఏడాది పాలన

ONE YEAR REVANTH GOVERNMENT

మిస్ ఫైర్..

మెస్మరైజ్..

తెలంగాణ పాట

అందెశ్రీ రచించిన పాట.. జయజయహే తెలంగాణ. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో తెలంగాణ సమాజాన్ని ఈ పాట ఉర్రూతలూగించింది. తెలంగాణ గేయంగా ఈ పాటను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించలేదు. రేవంత్ సర్కారు మాత్రం ఈ పాట కోసం ముందడుగు వేసింది. అయితే, కీరవాణి ఈ పాటకు సంగీతం సమకూర్చటం చాలామంది తెలంగాణవాదులకు మింగుడు పడలేదు. కానీ.. ఆస్కార్ లెవెల్ సంగీత దర్శకుడు కావటంతో కొన్ని ఆశలు ఉండేవి. పాట విడుదల అయ్యాక ఆ ఆశలు గల్లంతయ్యాయి. ఆ తర్వాత ఆ పాట గురించి ప్రభుత్వం కూడా పెద్దగా స్పందించకపోవడం గమనార్హం.

తెలంగాణ లోగో

తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని మారుస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందుకోసం ప్రత్యేకంగా భేటీలు నిర్వహించి.. కొత్త లోగో కోసం ప్రయత్నాలు చేశారు. రేపో మాపో లోగో ప్రకటన చేస్తారనుకున్న తరుణంలో.. కొందరు మేధావుల సూచనతో ఆ నిర్ణయం వాయిదా పడింది. లోగోను మార్చి తీరుతామని.. తెలంగాణ పోరాటాన్ని గుర్తుకుతెచ్చేలా రూపకల్పన చేస్తామని పలుమార్లు రేవంత్ తెలిపారు. అయితే, లోగో మార్పు కష్టమేనన్న అభిప్రాయలు వ్యక్తం అవుతున్నాయి.

ఫార్మా సిటీ

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ఫార్మాసిటీని రద్దు చేస్తామని రేవంత్ అనేక సార్లు ప్రకటించారు. ఫార్మాసిటీ జీవో 31ని రద్దు చేస్తూ ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఫార్మాసిటీని రద్దు చేస్తే తమ భూములు తమకే ఇవ్వాలని రైతుల నుంచి డిమాండ్లు వచ్చాయి. దీంతో రేవంత్ సర్కారు వెనక్కి తగ్గింది. పైగా, ఫార్మా సిటీ రద్దు కాలేదని హైకోర్టుకు ప్రభుత్వం స్పష్టతనిచ్చింది కూడా. 2016 జూన్ 10న పరిశ్రమల శాఖ జారీ చేసిన జీవో అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తేల్చి చెప్పింది.

లగచర్ల

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. అయితే, అక్కడి రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. భూసేకరణ అంశంపై మాట్లాడేందుకు వచ్చిన ఆ జిల్లా కలెక్టర్‌పై దాడి కూడా జరిగింది. దేశవ్యాప్తంగా ఈ వ్యవహారం సంచలనం సృష్టించింది. దీంతో ఫార్మా విలేజ్ కోసం లగచర్లలో భూసేకరణ నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రకటన చేసింది. భూసేకరణ చట్టం 2013లోని సెక్షన్ 93 ప్రకారం.. తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది.

కాళేశ్వరం

వాస్తవంగా కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయ స్వరూపాన్నే మార్చేసిందనేది అధికారిక లెక్క. అయితే, సరిగ్గా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడంతో కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా చూపించేందుకు రేవంత్ సర్కారు శతవిధాలా ప్రయత్నించింది. ఇక ఆ ప్రాజెక్టు వ్యర్థమేనన్న నిర్ణయానికి తెచ్చేసింది. కానీ.. గత వర్షాకాలంలో వరదలకు బరాజ్ నిట్టనిటారుగా నిలబడటంతో కాంగ్రెస్ సర్కారు ఎత్తులు పారలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పదేనన్న అభిప్రాయం ప్రజల్లో మళ్లీ కలిగింది. ఇది ఒకరకంగా రేవంత్ సర్కారుకు దెబ్బే.

తల్లీ తెలంగాణమా.. నీ రూపం ఏదమ్మా?

ఒక్కడు.. అందరితో కలిసి

కేసీఆర్ సర్కారులో ప్రతీది కేసీఆర్ చెప్పిందే లెక్క అన్నట్లు ఉండేది. కేటీఆర్, కవిత, హరీశ్‌రావు నిర్ణయాలకు కాస్త ప్రాధాన్యం ఉండేది. ఆ అంశాలే.. ఓటు బ్యాంకు కాంగ్రెస్ వైపు మళ్లడానికి ఓ కారణం. దాన్ని గుర్తించిన సీఎం రేవంత్.. సీనియర్లకు అవసరమైనప్పుడల్లా ప్రాధాన్యం కల్పిస్తున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ అంటే గ్రూప్ కుమ్ములాటలకు పెట్టింది పేరు. కానీ.. సీఎం పదవి ఆశించిన సీనియర్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకటరెడ్డి తదితరులు రేవంత్‌తో కలిసి నడుస్తున్నారు. ఈ అంశంలో రేవంత్ సూపర్ సక్సెస్ అయ్యారు. ప్రభుత్వ ప్రకటనల్లో భట్టి ఫొటోకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా రేవంత్ తీరును అద్దం పడుతోంది.

టీఎస్ నుంచి టీజీ

తెలంగాణ ఉద్యమ కాలంలో తెలంగాణవాదులంతా తమ బైక్ నంబర్ ప్లేట్లకు టీజీ అని రాసుకొని నిరసన తెలిపారు. తమ ప్రాంతం తమ హక్కు అని నినదించారు. అందుకు టీజీ అక్షరం ఒక ఆయుధంగా మారింది. ఆ సందర్భంలో టీజీ అని రాసుకోవడం భావోద్వేగానికి సంబంధించినది మారింది. అయితే, తెలంగాణ వచ్చాక.. కేసీఆర్ సర్కారు టీజీకి బదులు టీఎస్ వినియోగానికి కేంద్రానికి విన్నవించింది. ఆ నిర్ణయం 'టీజీ' అభిమానులకు రుచించలేదు. టీఎస్ అంటే టీఆర్ఎస్ వచ్చేలా చేసుకున్నారని కేసీఆర్‌పై ఆరోపణలు చేశారు. అయితే, రేవంత్ సర్కారు టీఎస్‌ను తొలగించి టీజీని చేర్చడం ప్రజల్లో సానుకూల ప్రభావాన్ని చూపింది.

అదానీ 100 కోట్లు

రేవంత్ సర్కారు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న స్కిల్ ఇండియా యూనివర్సిటీ కోసం అదానీ గ్రూప్ రూ.100 కోట్లు ప్రకటించింది. చెక్కును సీఎం రేవంత్‌కు కూడా అందజేసినట్లు ఫొటోలు వచ్చాయి. అయితే, అమెరికాలో అదానీపై కేసు నమోదు కావటంతో ప్రతిపక్ష బీఆర్ఎస్.. రేవంత్ సర్కారును ఎండగట్టింది. అదానీ 100 కోట్ల చెక్కు అంశం కాంగ్రెస్ అధిష్ఠానానికీ ఇబ్బందిగా మారింది. ఒకవైపు అదానీపై రాహుల్ గాంధీ పోరాడుతుంటే.. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వమే అదానీ నుంచి రూ.100 కోట్లు తీసుకోవడం ఏంటని బీఆర్ఎస్ నిలదీసింది. దీంతో ఆ రూ.100 కోట్ల విరాళం స్వీకరించవద్దని నిర్ణయించినట్లు సీఎం రేవంత్ ప్రకటించాల్సి వచ్చింది.

రుణమాఫీ

రైతు రుణమాఫీ ప్రతి రైతుకు అందిందా? అన్న ప్రశ్నను పక్కనబెడితే.. రుణమాఫీ చేసి రేవంత్ సర్కారు ఒక గొప్ప సాహసోపేత నిర్ణయమే తీసుకుందని చెప్పాలి. తమ పాలనకు ఇంకా ఐదేళ్లు ఉన్నా.. ప్రభుత్వం ఏర్పడిన ఆర్నెల్లలోనే భారీ స్థాయి నిధులు కేటాయించి రైతులకు రుణమాఫీ చేసింది. ఈ ప్రక్రియలో కొందరు రైతులకు రుణమాఫీ ఫలాలు అందలేదన్నది వాస్తవం. కానీ.. రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేసి సీఎం రేవంత్ ఒక మెట్టు ఎక్కారు. వ్యక్తిగతంగా రైతులకు ఎంతో మేలు జరిగింది. బ్యాంకుల్లో తనఖా పెట్టిన భూ కాగితాలను తిరిగి తీసుకున్నారు. ప్రభుత్వం వచ్చిన కొత్తలోనే రుణమాఫీ చేయడం ఆహ్వానించదగ్గ విషయమే.

ఫ్యూచర్ సిటీ

హైదరాబాద్‌కు దక్షిణాన.. శ్రీశైలం రోడ్డులో కొత్త నగరం (ఫ్యూచర్ సిటీ) అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. తమ నిర్ణయంతో హైదరాబాద్ ను నలువైపులా అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. ఆ నిర్ణయంపై రియల్ ఎస్టేట్ రంగం ఆ వైపు చూసింది. రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ తగ్గినా, ఫ్యూచర్ సిటీ ఏరియాలో మాత్రం జోరుగా కొనసాగుతోంది. అయితే.. వ్యాపారం ఒక్కటే కాకుండా నిజమైన అభివృద్ధికి అడుగులు పడి.. ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటే రేవంత్ సర్కారు చరిత్రలో ఒక మైలురాయి అవుతుంది.

ఇందిరమ్మ ఇళ్లు

ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లు అని చెప్పున్న అనేక ఇళ్లు కట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే. కానీ.. వాటిని పేదలకు అందజేయడంలో కేసీఆర్ సర్కారు ఘోరంగా విఫలమైంది. ఎన్నికలకు ముందు కూడా డబుల్ బెడ్రూంలపై కేసీఆర్ పెద్దగా ఫోకస్ చేయలేదు. అక్కడక్కడా కాలనీల్లో ప్రారంభోత్సవాలు చేసినా ప్రభావం కనిపించలేదు. ఆ అవకాశాన్ని రేవంత్ సర్కారు పూర్తిగా సద్వినియోగం చేసుకుంటోంది. బీఆర్ఎస్ సర్కారు కట్టిన ఇళ్లతో పాటు.. ఇంటి స్థలం ఉన్నవారికి రూ.5 లక్షల సాయం ఇస్తామని చెప్తోంది. గతంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన ఘనత కాంగ్రెస్‌దే. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పూర్తి చేస్తే ఆ క్రెడిట్ రేవంత్ సర్కారుకు భారీగానే దక్కుతుంది.

హైడ్రా

హైదరాబాద్‌లో వరదలకు కారణం అవుతున్న చెరువుల కబ్జాలను తొలగించాలని ప్రత్యేకంగా హైడ్రా అనే విభాగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం హైడ్రా నిర్ణయాలు అనేక మంది పేదల ఇళ్లు పోవటానికి కారణమైనా.. ప్రభుత్వ స్థలం కాపాడటంతో హైడ్రా తీరును ప్రశంసించాల్సిందే. రియల్ ఎస్టేట్‌పై పట్టున్న రేవంత్.. ఇలాంటి సాహసోపేత నిర్ణయం తీసుకోవడం గ్రేట్. ఏమాత్రం తప్పటడుగులు వేసినా రియల్ ఎస్టేట్ కుప్పకూలిపోతుంది. ఆ విషయం తెలిసినా రేవంత్ ముందుకే సాగుతున్నారు. అటు.. రంగనాథ్ లాంటి డైనమిక్ ఆఫీసర్లు కూడా ఉండటం హైడ్రా పరపతిని పెంచుతోంది.

ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 9666711515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా,
rhushinews@gmail.com
మెయిల్‌కు బయో డేటా పంపగలరు.

రాశి ఫలితాలు 07.12.2024

మేషం: అనుకున్న వ్యవహారాలు ముందుకు సాగవు. ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. కొన్ని విషయాలలో బంధువులు, మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆర్థిక సమస్యలు సతమతం చేస్తాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

వృషభం: సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు విస్తృతమవుతాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. సోదరుల నుంచి ధన సహాయం అందుతుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఆశించిన మార్పులుంటాయి.

మిథునం: ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. విద్యార్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. వాహనయోగం ఉన్నది. పనులలో అవాంతరాలు అధిగమిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి.

కర్కాటకం: ముఖ్యమైన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది.

సింహం: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఇంటాబయట సమస్యలు బాధిస్తాయి. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగాలు అంతంతమాత్రంగా ఉంటాయి.

కన్య: చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. ఆప్తుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. బంధువులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కుటుంబ సభ్యులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఉద్యోగాలలో బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తారు.

తుల: చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. నిరుద్యోగులు కష్టపడ్డా ఫలితం ఉండదు. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక చికాకులు కలుగుతాయి. ముఖ్య వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలలో నూతన సమస్యలు ఎదురవుతాయి.

వృశ్చికం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక వ్యవహారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు. కొనుగోలు ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా పని చేసి అధికారుల అనుగ్రహం పొందుతారు.

ధనస్సు: కీలక వ్యవహారాలు మందగిస్తాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. సోదరులతో అకారణ కలహా సూచనలు ఉన్నవి. నూతన రుణ యత్నాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

మకరం: అనుకున్న పనులు అనుకున్న రీతిలో సాగుతాయి. మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి చేసే ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ప్రభుత్వ అధికారులతో చర్చలు సఫలమవుతాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక మార్పులు కలుగుతాయి.

కుంభం: నిరుద్యోగులకు నూతన ఉద్యోగాలు దక్కుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. సంతానం విద్యా విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలిస్తాయి.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. నూతన రుణయత్నాలు సాగిస్తారు. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు చోటుచేసుకుంటాయి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది.

దళితుల అభివృద్ధికి ప్రభుత్వం వ్యతిరేకం

దళిత బంధు పెంచి ఇస్తామంటూ హామీ ఇచ్చి మోసం.. అసెంబ్లీ సమావేశాలు నెల పాటు నిర్వహించాలి: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. "అంబేద్కర్ వారసత్వం, లెగసీ సమాజానికి తెలియకూడదనే దురుద్దేశంతో, అంబేద్కర్ వ్యతిరేక ఆలోచనా విధానంతో ఆయన వర్ధంతిని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించడం లేదు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అతిపెద్ద అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం కనీసం పూలమాల కూడా వెయ్యట్లేదు. దళితులందరికీ సమాజంలోని ప్రజలందరికీ స్ఫూర్తినిచ్చే అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలి. దీని వెనుక ఉన్న లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వం తెలియజేయాలి. కేవలం కాంగ్రెస్ హై కమాండ్ ఉద్దేశాలతోనే అంబేద్కర్ విగ్రహానికి అవమానం చేస్తున్నారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. "ప్రకాష్ అంబేద్కర్ చేత ప్రారంభించిన మహా విగ్రహానికి ఎందుకు అవమానం చేస్తుంది? తాళాలు వేసి బంధించి కనీసం శుభ్రపరచకుండా ఎందుకు పెట్టింది. బీఆర్ఎస్ పైన అక్కసు ఉంటే దానిని అంబేద్కర్ విగ్రహం పైన ఎందుకు చూపిస్తున్నారు. అంబేద్కర్‌కు నివాళులు అర్పించకుండా అడ్డుకుంటుంది మమ్మల్ని కాదు అంబేద్కర్ వారసులను అంబేద్కర్ ఆలోచన విధానాన్ని. అంబేద్కర్‌కి నివాళులు అర్పించాలనే ఇంగిత సంస్కారం లేని కుసంస్కారి రేవంత్ రెడ్డి. ప్రపంచం అబ్బురపడిన మహా మేధావి అంబేద్కర్ గారిని స్మరించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికక్కడో విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నారు. అదే స్ఫూర్తితో దేశానికి ఒక గొప్ప సందేశం ఇచ్చేలా ఏర్పాటు చేసుకున్న 125 ఫీట్ల అంబేద్కర్ విగ్రహం పైన ప్రభుత్వం కావాలని నిర్లక్ష్యం వహిస్తున్నది" అని కేటీఆర్ అన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానానికి అంబేద్కర్ విగ్రహానికే కాదు దళితుల అభివృద్ధికి సైతం ఈ ప్రభుత్వం వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది. దళిత బంధు పెంచి ఇస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేసింది. దళిత బంధు చెక్కులను రద్దుచేసి వారి జీవితాలను మారకుండా చేస్తున్నది. పేద దళిత గిరిజన బహుజన బిడ్డలను ఉన్నత చదువుల కోసం గత ప్రభుత్వం విదేశాలకు పంపిస్తే 75% ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఓర్వలేక వారి ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులను నిలిపివేశారు. తెలంగాణ బిడ్డలు విదేశాల్లో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. గురుకుల విద్యార్థులను మేము ఎవరెస్ట్ ఎక్కిస్తే, ఈ ప్రభుత్వం వారిని పాడె ఎక్కిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వివక్షను చేతగానితనాన్ని దాచిపెట్టడం కోసమే భారత రాష్ట్ర సమితి చేపట్టిన గురుకుల బాటను అడ్డుకుంది" అని కేటీఆర్ తెలిపారు. "ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వంటి నాయకుల పైనా కేసులు పెట్టింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షకుని మాదిరిగా పోజులు కొడుతూ దేశంలో తిరుగుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో తమను అడ్డుకున్న పోలీసుల పైన ఉక్రోషం వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ, అదే హోదాలో ఉన్న ఎమ్మెల్యేలను శాసనసభ పక్ష నేతలను తెలంగాణ పోలీసులు అడ్డుకున్న విషయాన్ని గుర్తించాలి. తమ సొంత కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేకంగా నియంతృత్వంగా వ్యవహరిస్తున్న తీరుని గుర్తించాలి. నిజంగానే రాహుల్ గాంధీకి రాజ్యాంగం పైన ప్రేమ ఉంటే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్న తీరు పైన సద్బుద్ధి ప్రసాదించాలని సూచించాలి" అని కేటీఆర్ అన్నారు. "రానున్న అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజులపాటు నిర్వహించాలి. 11 నెలల కాలంలో ఈ రాష్ట్రం సబ్బండ వర్గాలకు చేసిన అన్యాయాలను ప్రశ్నిస్తాము. లగచర్ల అంశం నుంచి మొదలుకొని రాష్ట్రంలో కొనసాగుతున్న ఆత్మహత్యలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల అమలులో వైఫల్యం, వ్యవసాయ రంగ సంక్షేమం, ప్రతి అంశం పైనా, ప్రజా సమస్యల పైన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాము. మా పార్టీ అధ్యక్షులు తెలంగాణ ప్రధాత కేసీఆర్ గారి పైన కాకికూతలు కారుకూతలు మానకుంటే ముఖ్యమంత్రి కి ముఖ్యమంత్రి పదవికి కూడా గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇదే ముఖ్యమంత్రి సోనియాగాంధీని అడ్డగోలుగా దూషించిన విషయాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. రేవంత్ రెడ్డి నోటి తీరు మార్చుకుంటేనే ఆయన పదవికి గౌరవం దక్కుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. తమ ప్రవర్తనతో పదవులకు వ్యక్తులకు గౌరవం వస్తుంది. కానీ అడుక్కుంటే కాదని రేవంత్ రెడ్డి తెలుసుకోవాలి. రేవంత్ రెడ్డి ఏర్పాటు చేస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహమా? కాంగ్రెస్ తల్లి విగ్రహమా? చెప్పాలి" అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినప్పుడు విగ్రహాల రూపులు చరిత్రను మారుస్తామంటే ఎవరూ ఒప్పుకోరు. ఉద్యమకాలంలో సబ్బండ వర్గాలు, కవులు, కళాకారులు, మేధావులు అంతా కలిసి తెలంగాణ పరిస్థితిలకు అనుగుణంగా సంస్కృతికి అనుగుణంగా రూపం ఇచ్చిన తల్లి విగ్రహమే తెలంగాణ తల్లి. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలను దాటుకొని ఒక దేవతను ఊరేగించిన మాదిరి తెలంగాణ తల్లి విగ్రహ స్థాపన చేశాం. రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి రూపు మారుస్తానని తెలంగాణ చరిత్రను మారుస్తానని నీచమైన మనస్తత్వంతో ఈ కుటిల ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఇందిరాగాంధీ భరతమాత విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే తర్వాతి ప్రభుత్వాలు మార్చాయా? తెలుగు తల్లిని, కన్నడ తల్లిని మార్చినప్పుడు తెలంగాణ తల్లిని మార్చే కుసంస్కారం భావదారిద్ర్యం రేవంత్ రెడ్డికి ఎందుకు? కచ్చితంగా మేము ప్రభుత్వంలోకి రాగానే రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం ఏర్పాటు చేసిన చోట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఏర్పాటు చేస్తాం. అమరవీరుల స్తూపానికి అంబేద్కర్ సచివాలయానికి మధ్యన ఉండాల్సింది కచ్చితంగా తెలంగాణ తల్లి విగ్రహం. అందుకే రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం పంపాల్సిన చోటికి పంపిస్తాం. తెలంగాణ చరిత్రను మారుస్తామంటే ఊరుకునేది లేదని కేటీఆర్ మండిపడ్డారు.

బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు తేడా ఇదే

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): ఈ దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహానీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడాన్ని బీఆర్ఎస్ పార్టీ తప్పుబట్టింది. అంబేద్కర్ విగ్రహానికి కనీసం నివాళులర్పించకుండా నిమ్మకు నీరెత్తినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. రాహుల్ గాంధీజీ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించాలని మీరేమైనా మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి, మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా ఏంటో ఈ చిత్రం చూస్తే తెలిసిపోతుందన్నారు.

వివక్షపై పోరాడిన మహనీయుడు

దేశానికి అంబేడ్కర్ సేవలు అసాధారణం.. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి: కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దేశానికి వారందించిన సేవలను, అనితర సాధ్యమైన కృషిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్య అనంతరకాలంలో ప్రపంచానికే ఆదర్శవంతమైన స్వయం పాలన కోసం రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. ఆర్థిక సామాజిక రాజకీయ సాంస్కృతిక తదితర రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన వాటా సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని పొందుప రచడంలో బాబాసాహెబ్ కనబరిచిన దార్శనికత మహోన్నతమైన దని కేసీఆర్ కొనియాడారు. దేశంలో రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా అంబేద్కర్ పొందుపరిచిన ఆర్టికల్ 3, ఈ దిశగా వారి దార్శ నికత, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం చూపిందని గుర్తు చేశారు. వారి విశేష కృషిని, వారు అందించిన స్ఫూర్తిని చాటేందుకు ప్రపంచంలోనే అత్యంత మహోన్నతమైన రీతిలో వారి స్మారక్రూ పాన్ని తెలంగాణాలో అత్యంత ఎత్తయిన విగ్రహంగా నిలుపుకున్నామన్నారు. దేశ పాలనకు తన రాజ్యాంగం ద్వారా బాటలు వేసిన బీఆర్ అంబేద్కర్ ఘనమైన కీర్తిని చాటేందుకు దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా తెలంగాణ పాలనా భవనానికి 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్' అని పేరు పెట్టుకున్నామని తెలిపారు. వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన అంబేద్కర్ అజరామర కీర్తిని ప్రపంచానికి చాటేందుకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు.

అనేక విప్లవాత్మక కార్యక్ర మాలను అమలు చేసిందని తెలిపారు. అంటరాని వర్గాలుగా తరతరాలుగా వివక్షకు గురవుతున్న దళిత సమాజాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి వారి సామాజిక గౌరవం ఇనుమడింప చేసే దిశగా, అంబేద్కర్ స్ఫూర్తితోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం అమలు చేసిందన్నారు. దళిత జీవితాల్లో వెలుగులు నింపే దిశగా దళిత బంధు సత్ఫలితాలు సాధించిందని తెలిపారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని రంగాల్లో వివక్ష లేని సమ సమాజ నిర్మాణానికి అవసరమైన కృషి చేయడం ద్వారానే, అంబేద్కర్ మహనీయునికి మనం ఘన నివాళి అర్పించగలమని కేసీఆర్ పేర్కొన్నారు.

రేపు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ సమావేశం

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎల్లుండి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం కానున్నారు. ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 1 గంటలకు బీఆర్ఎస్ ప్రజాప్రతి నిధులతో ఆయన సమావేశమవుతారు. ఎర్రవె ల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ సమావేశం జరగనుందని కేటీఆర్ వెల్లడించారు.

హరీశ్‌రావు, కవిత నిర్బంధం

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): ఎమ్మెల్యేలు, నేతల అక్రమల అరెస్టులకు నిరసనగా ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేస్తున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు కవిత, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, పద్మారావు గౌడ్, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను హౌస్ అరెస్టు చేశారు. కోకాపేటలోని హరీశ్‌రావు ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఆయన బయటకి వెళ్లనీయకుండా గృహ నిర్బంధం చేశారు. దీంతో పోలీసులతో హరీశ్‌రావు వాగ్వాదానికి దిగారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళులు అర్పించేందుకు వెళ్లకుండా ఈ నిర్బంధాలు ఎందుకని ప్రశ్నించారు. ఇక శుక్రవారం ఉదయం నుంచే ఎమ్మెల్సీ కవిత ఇంటికి పోలీసులు చేరుకున్నారు. ఆమెను ఇంట్లో నుంచి బయటకు రాకుండా చూస్తున్నారు. ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును హౌస్ అరెస్టు చేసిన పోలీసులు.. వారి నివాసాల వద్ద భారీగా మోహరించారు.

అరెస్టులతో భయపడను: కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): ఇలాంటి అరెస్టులకు భయపడేది లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాని చెప్పారు. ఊపిరి ఉన్నంత వరకు హుజూరాబాద్ ప్రజల కోసం ప్రశ్నిస్తానన్నారు. ప్రజల ఇచ్చిన ఆరు గ్యారంటీల కోసం ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అర్ధరాత్రి జడ్జి బెయిల్ మంజూరు చేసిన అనంతరం అయన మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కౌశిక్‌రెడ్డిని కొండాపూర్‌లోని తన నివాసంలో జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే నోటీసులు ఇచ్చి వదిలిపెట్టేందుకు అవకాశాలున్నా రాత్రి పొద్దుపోయే దాకా పీఎస్‌లోనే నిర్బంధించారు. రాత్రి 10.30 గంటలు దాటిన తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి అర్ధరాత్రి కొత్తపేటలోని న్యాయమూర్తి ఇంట్లో హాజరుపరిచారు. వాదనలు విన్న జడ్జి.. రిమాండ్‌ను తిరస్కరించారు. రూ.5 వేలు జరిమాన, ఇద్దరి పూచీకత్తుతో కౌశిక్‌కు బెయిల్ మంజూరు చేశారు.

ఇన్ని నిర్బంధాలు ఎందుకు?: హరీశ్

హైదరాబాద్,డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వెళ్ళనివ్వకుండా ఈ నిర్బంధాలు ఎందుకని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఇది నీ నిరంకుశ, నియంతృత్వ పాలనకు నిలువుటద్దమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకవైపు ప్రజా పాలన విజయోత్సవాలు అని ప్రచారం చేసుకుంటూ, మరోవైపు రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీని ప్రకటించావని ధ్వజమెత్తారు. మీ అప్రజాస్వామిక విధానాలు, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వైఖరిని చూసి హైదరాబాద్ నడిగడ్డపై ఉన్న అంబేద్కర్ సైతం నివ్వెరపోతున్నాడని చెప్పారు. అదుపులోకి తీసుకున్న తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ ఏర్పాటు

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు పూర్తి స్వేచ్ఛ

పోలీసులపై ఒత్తిడి లేకుండా కాంగ్రెస్ పాలన

సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రభుత్వ సహకారం

పైరవీలు లేకుండా పోలీస్ శాఖలో బదిలీలు

ప్రజాపాలన విజయోత్సవాలలో సిఎం రేవంత్‌రెడ్డి

హోం శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా తెలంగాణ పోలీసుల ధైర్య సాహసాలు కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. ఇందుకు వేదికగా మారింది హైదరాబాద్ లోని హెచ్ఎండీఏ గ్రౌండ్. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో హోం శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా పలు స్టాల్స్ లను ఏర్పాటు చేయగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, అధికారులు వాటిని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. మహనీయులు అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ ఏర్పడిందని, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో స్వేచ్ఛను ఇచ్చిందన్నారు. ఇప్పటికే తాము ఆరు గ్యారెంటీలను ప్రవేశపెట్టామని, అదే రీతిలో ఏడో గ్యారంటీగా స్వేచ్ఛను అందించమని సీఎం అన్నారు. పోలీసులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తి చేసుకుందని తెలిపారు. సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రభుత్వం అన్ని విధాలా పోలీసులకు సహకరిస్తుందన్నారు. అలాగే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని తెలంగాణ పోలీసులు పూర్తి స్థాయిలో అడ్డుకుంటున్నారని, మరింత స్పీడ్ పెంచాల్సిన ఆవశ్యకత పోలీసులపై ఉందన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా పోలీస్ శాఖలో బదిలీల, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసినట్లు సీఎం పునరుద్ఘాటించారు. హైదరాబాద్ అంటేనే డ్రగ్స్ విక్రయాలు నిర్వహించేందుకు భయపడే రీతిలో పోలీసులు విధులు నిర్వర్తించాలని సీఎం సూచించారు. అలాగే విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కూడా పోలీస్ శాఖ కూడా తన వంతు భాద్యత వహించాలని సీఎం సూచించారు. ట్రాఫిక్ విధుల్లోకి ట్రాన్స్ జెండర్స్ ను తీసుకొని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, సమాజ నిర్లక్ష్యానికి గురైన వారి విధులను పోలీస్ శాఖ సద్వినియోగం చేసుకుంటుందని తెలిపారు. ఉగ్రవాదుల ముప్పు సమయంలో గ్రేహౌండ్స్ బలగాలు ప్రాణాలు అర్పిస్తే వారి కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తూ తోడ్పడుతుందన్నారు. తెలంగాణ హోం గార్డ్స్ కి జీతాలు పెంచినట్లు సీఎం శుభవార్త చెప్పారు. ఎవరైనా హోం గార్డ్స్ విధుల్లో ప్రాణాలు అర్పిస్తే, వారి కుటుంబాలకు రూ. 5 లక్షలు అందిస్తామన్నారు. అంతేకాకుండా వారికి హెల్త్ కార్డ్ లు కూడా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, కొత్త సంవత్సరంలో నూతన ఆదేశాలు అమలవుతాయని సీఎం అన్నారు. పోలీస్ కుటుంబాల పిల్లల చదువుల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, అందుకు 50 ఎకరాలలో స్కూల్ నిర్మించడం జరుగుతుందని, హోం గార్డ్ నుండి డీజీపీ స్థాయి అధికారి పిల్లలకు ఉచిత విద్యను కార్పొరేట్ స్థాయిలో అందిస్తామని సీఎం వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలో సుమారు 94 వేల మంది పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్నారని, వారి కృషి ఉత్తమ విధులతోనే రాష్ట్రం శాంతిభద్రతల పరిరక్షణలో ఎప్పుడూ ముందంజలో ఉందని సీఎం అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు రాష్ట్ర విపత్తు నిర్వహణ దళంను (ఎస్‌డీఆర్ఎఫ్) ప్రారంభించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హోంశాఖ వేడుకలను నిర్వహించింది. ఈ క్రమంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో దాదాపు రెండు వేల మంది సిబ్బందితో ఎస్‌డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర విపత్తు దళానికి చెందిన బోట్స్‌ను కూడా సీఎం ప్రారంభించారు. భారీ అగ్నిప్రమాదాలు, భూకంపం, వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ఈ దళం అత్యవసర సహాయక చర్యలు చేపట్టనుంది. అగ్నిమాపక కేంద్రాలు ఇక నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ స్టేషన్లుగా రూపాంతరం చెందనున్నాయి. జులై, ఆగస్ట్ నెలల్లో భారీ వర్షాలు కురవడంతో హైదరాబాద్, ఖమ్మం సహా పలు ప్రాంతాలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... ఎన్‌డీఆర్ఎఫ్ తరహాలో సుశిక్షితులైన దళం అవసరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఎస్‌డీఆర్ఎఫ్ ను ఏర్పాటు చేయడంతో పాటు దీనిని ఆధునికీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35.03 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆధునాతన పరికరాలు, కొత్త అగ్నిమాపక వాహనాలను కొనుగోలు చేసి సిబ్బందికి ఎస్‌డీఆర్ఎఫ్ ప్రాథమిక కోర్సులో శిక్షణ ఇప్పించారు.

51 గ్రామాల విలీనానికి
లైన్ క్లియర్

ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల విలీనానికి గ్రీన్ సిగ్నల్

పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ మాజీ సర్పంచుల పిటిషన్

పిటిషన్‌ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల విలీనానికి లైన్ క్లియర్ అయింది. మున్సిపాలిటీల్లో 51 గ్రామాల విలీనానికి ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌కు హైకోర్టులో అడ్డంకులు తొలగిపోయాయి. పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ.. మాజీ సర్పంచులు వేసిన పిటిషన్‌ను కొట్టేసింది హైకోర్ట్. పెద్ద అంబర్‌పేట, శంషాబాద్, నార్సింగి, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట మున్సిపాలిటీల్లో 51 గ్రామాలు విలీనం కానున్నాయి. మేడ్చల్ జిల్లాలో మొత్తం 28 గ్రామాలు ఏడు మున్సిపాలిటీల్లో విలీనం చేస్తున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 12 గ్రామాలు, సంగారెడ్డి జిల్లాలో రెండు మున్సిపాలిటీల్లో 11గ్రామాలు విలీనం కానున్నాయి. ఈ గ్రామాలన్నీ కూడా ఔటర్ రింగు రోడ్డుకు అనుకున్న గ్రామాలే. శివారు గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం తర్వాత వీటన్నింటినీ గ్రేటర్‌లో కలిపే అవకాశం ఉంది. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో బాచారం, గౌరెల్లి, తారామతిపేట పంచాయతీలు విలీనం కానున్నాయి. శంషాబాద్ మున్సిపాలిటీలో.. బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్ గూడ, ఘంసీమిగూడ విలీనం అవుతాయి. నార్సింగి మున్సిపాలిటీలో మీర్జాగూడ గ్రామపంచాయతీ విలీనం కానుంది. తుక్కుగూడ మున్సిపాలిటీలో హర్షగూడ గ్రామపంచాయతీ.. మేడ్చల్ మున్సిపాలిటీలో పూడూరు, రాయిలాపూర్ గ్రామపంచాయతీలు విలీనమవుతాయి. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో.. కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి

లగచర్ల కేసులో పట్నం నరేందర్‌రెడ్డికి కస్టడీ

నేడు చర్లపల్లి జైలు నుంచి వికారాబాద్‌కు

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాలోని లగచర్ల దాడి కేసులో ఏ-1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డిని కొడంగల్ కోర్టు పోలీస్ కస్టడీకి అనుమతించింది. నరేందర్ రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం నరేందర్ రెడ్డిని రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతించింది. ఆయన ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉన్నారు. అతనిని రేపు చర్లపల్లి జైలు నుంచి వికారాబాద్‌కు తరలిస్తారు. రెండు రోజుల పాటు అక్కడ ప్రశ్నిస్తారు.

గ్రూప్-1 పరీక్షల రద్దు కుదరదు

తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట

పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమన్న ధర్మాసనం

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదని భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్‌ను వాయిదా వేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. విచారణ జరిపిన న్యాయస్థానం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించినట్లయింది. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త నోటిఫికేషన్ చట్ట విరుద్ధమని కొంతమంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రిలిమ్స్‌లో 14 తప్పులున్నాయని పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌ను వాయిదా వేయాలని కోరారు. అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును అభ్యర్థులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. పిటిషనర్లు మెయిన్స్‌కు క్వాలిఫై కానందున మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాల్సిన అవసరం లేదని తెలిపింది. పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమని ధర్మాసనం పేర్కొంది. కోర్టుల నిర్ణయంతో నియామకాల్లో జాప్యం జరుగుతుందని తెలిపింది. మెయిన్స్ నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వానికి పచ్చజెండా ఊపింది.

రేవంత్ స్థాయిని మరిచి మాట్లడుతున్నారు

చిల్లర మాటలు మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన హోదాను, స్థాయిని మరిచి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డికి డీఎస్పీ పరీక్ష జరగాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు శిక్ష తప్పదని హెచ్చరించారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నివాళులర్పించిన ఈటల మాట్లాడుతూ... రాజ్యాంగ స్ఫూర్తిని ప్రధాని మోదీ సమున్నతంగా కాపాడుతున్నారన్నారు. ప్రజాస్వా మ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజలకు సేవకులుగా ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలతో ప్రజలను దగా చేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఏం మంచి చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు చేసుకుంటుందో చెప్పాలన్నారు. ప్రజాక్షేత్రంలో తాము ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు. రేవంత్ రెడ్డి ఈ ఏడాది కాలంలో ఏం చేశారని అన్ని వర్గాలు ప్రశ్నిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ దుర్మార్గాలను ఖండిస్తూ నిర్వహించబోయే సభకు జేపీ నడ్డా హాజరవుతారని తెలిపారు.

సచివాలయంలో 9న విగ్రహావిష్కరణ

కేసీఆర్, కిషన్‌రెడ్డి ఆహ్వానిస్తాం.. మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఆహ్వానిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందుకోసం వారిని సమయం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. వారు అపాయింట్ మెంట్ ఇస్తే ప్రభుత్వం తరఫున ఆహ్వానిస్తామన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు విపక్ష నేతలను ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేసీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఆహ్వానిస్తామని సీఎం రేవంత్ రెడ్డి నిన్ననే చెప్పారని గుర్తు చేశారు. వారు ఈ నెల 9న జరగనున్న ఈ కార్యక్రమానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

వాహనాలకు స్క్రాప్ పాలసీ

15 సంవత్సరాలు దాటిన వాహనాలకు సరికొత్త పాలసీ

వాయు కాలుష్యం వెదజల్లే వాహనాలపై దృష్టి

డీజిల్ వాహనాలపై ఆంక్షలు విధించేందుకు రంగం సిద్ధం

డీజిల్ బస్సులను ఔటర్ రింగ్ రోడ్డు అవతల నడిపేలా చర్యలు

ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే సిటీలో పర్మిషన్

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): ఇప్పటికే మహాలక్ష్మీ ఉచిత బస్సు పథకంతో ఇబ్బంది పడుతున్న ఆటోలకు ఇది మరో షాకింగ్ న్యూస్..! ఢిల్లీలో పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వ అలర్ట్ అయింది. వాయు కాలుష్యం ఎక్కువగా వెదజల్లే వాహనాల క్రమబద్ధీకరణకు కొత్త పాలసీని అమలు చేయాలని నిర్ణయించింది తెలంగాణ ప్రభుత్వం. అందులో భాగంగా 15 సంవత్సరాలు దాటిన వాహనాలకు సరికొత్త స్క్రాప్ పాలసీని తీసుకొచ్చింది. అంతేకాకుండా డీజిల్ వాహనాలను నగర శివారు ప్రాంతాలకే పరిమితం చేయాలని భావిస్తోంది. కాలుష్యం ఎక్కువగా పెరిగిపోతుడడంతో హైదరాబాద్ మహానగరంలో డీజిల్ వాహనాలపై ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది రాష్ట్ర ప్రభుత్వం. అందులో భాగంగా హైదరాబాద్‌లో నడుస్తున్న ఆర్టీసీ బస్సుల్లో 90% బస్సులు డీజిల్ వాహనాలే. అందుకని డీజిల్ బస్సులను ఔటర్ రింగ్ రోడ్డు అవతలకు తరలించాలని నిర్ణయించింది. ఇక, మూడు వేల కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి హైదరాబాద్‌లో తిప్పనున్నారు. ఇక, బస్సుల తర్వాత అత్యధికంగా రోడ్ల మీద నడిచే వాహనాల్లో ఆటోలు కూడా ప్రధానం. అందుకనే డీజిల్‌తో నడిచే ఆటోలను కూడా ఔటర్ రింగ్ రోడ్డు బయటకు తరలించాలని రింగ్ రోడ్డు లోపల తిరిగేందకు ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే పర్మిషన్ ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది.ఈ విషయాన్ని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి గురువారం జరిగిన రవాణా శాఖ ఉత్సవాల్లో ప్రకటించారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి అందించాలంటే కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకొందామని సీఎం పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా హైదరాబాద్ నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడాలంటే ఎట్టి పరిస్థితుల్లో డీజిల్ వాహనాలు తిరగకూడదని చెప్పారు. డీజిల్ బస్సులను ఔటర్ రింగ్ రోడ్డు వరకే పరిమితం చేయాలని సూచించారు. అలాగే డీజిల్ ఆటోలను సైతం నగర శివారులకు తరలించాలని భావిస్తున్నట్లు తెలిపారు. అయితే, ఎలక్ట్రిక్ బస్సులు వాడాలనుకోవడం సరే, కానీ ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు స్కీం తో ఆదాయ కోల్పోయిన ఆటోలకు ఇప్పుడు డీజిల్ ఆటోలకు సిటీలో తిరగనివ్వమని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అది కచ్చితంగా షాకింగ్ న్యూస్ అంటున్నారు. అయితే దీనిపై ఇప్పుడు ఆటో యూనియన్ ఎలా స్పందిస్తాయో చూడాలి. హైదరాబాద్ మహానగరంలో దాదాపుగా ఆటోలన్ని ఎల్పీజీ తో నడుస్తూ ఉన్నాయి. అయితే హైదరాబాద్‌లో నడుస్తున్న డీజిల్ ఆటోల సంఖ్య ఎంత అనేది తేలితే ఈ నిర్ణయం వల్ల ఆటో యూనియన్ నుంచి వ్యతిరేకత ఎంత మేర వస్తుందనేది అంచనా వేయొచ్చు..! కాలుష్యాన్ని తగ్గించాలనుకోవడం మంచి ఆలోచన. డీజిల్ వాహనాలను ఔటర్ రింగ్ రోడ్డు లోపల తిరగవద్దనుకునే ఆలోచన మంచిదే..! కానీ దానివల్ల ఆటో వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు మాత్రం నగరంలో డీజిల్ ఆటోలు తిరగకూడదని నిర్ణయం వల్ల ఇబ్బంది పడటం తప్పని పరిస్థితిలో కనిపిస్తుంది..

హైదరాబాద్ ప్రజలకు
భారీ షాక్..

పెండింగ్ నల్లా కనెక్షన్ల బకాయిల వసూలు

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): హైదరాబాద్‌లో ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటున్న నల్లా కనెక్షన్ల బకాయిలు వసూలు చేసేందుకు జలమండలి ఓటీఎస్ విధానం ప్రవేశపెట్టింది. దీని ద్వారా నల్లా బిల్లుల బకాయిలను ఎలాంటి ఆలస్య రుసుమూ, వడ్డీ లేకుండా చెల్లించే వీలుంది. తద్వారా ఇక బిల్లులు చెల్లించని వారు.. ఓటీఎస్ ఛాన్స్ వాడుకొని చెల్లించేసుకొని, బకాయిల బాధ లేకుండా చేసుకునే వీలు ఉంటుంది. మొదటగా దీనిని అక్టోబర్ 1 నుంచి 31, 2024 వరకు ప్రకటించి అమలు చేశారు. అయితే ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. దాంతో ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ఓటీఎస్ ప్రకటించిన అక్టోబర్ నెలలో దసరా, దీపావళి పండుగలు రావడం, సిటీ ప్రజలు స్వగ్రామాలకు వెళ్లడంతో బకాయిల చెల్లింపులు సరిగా సాగలేదు. దీంతో ఓటీఎస్ గడువును నవంబర్ 30 వరకు పొడిగించింది ప్రభుత్వం. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. 2020లో ఓటీఎస్ ద్వారా ప్రయోజనం పొందిన వారికి ఈ సారి అవకాశం లేకపోవడం ఒక కారణం అయితే.. ప్రజల్లో స్వతహాగానే బిల్లులు చెల్లించాలనే ఆసక్తి లేకపోవడం మరో కారణంగా కనిపిస్తోంది. హైదరాబాద్ జలమండలిలో పరిధిలో రూ.వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. అయితే 70,335 మంది బకాయిలు చెల్లించారు. వీరికి వడ్డీ, రుసుం రెండూ మాఫీ అయ్యాయి. నవంబర్ 30తో ఓటీఎస్ గడువు ముగిసింది. ఇప్పుడు మళ్లీ గడువు పొడిగించే ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నట్లు కనిపించట్లేదు. అందువల్ల నల్లా బిల్లుల బకాయిలు ఇంకా చెల్లించని వారు వెంటనే చెల్లించడం మంచిది. అలా కాదని మరింత ఆలస్యం చేస్తే, వడ్డీతోపాటూ పెనాల్టీ కూడా పెరిగిపోయే ప్రమాదం ఉంటుంది.

మరో అల్పపీడనం!

తెలుగు రాష్ట్రాల్లో ప్రభావం చూపే అవకాశం

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): దక్షిణాదిన దడ పుట్టించిన ఫెంగల్ తుపాన్ తీరం దాటడంతో అంతా హమ్మయ్య అనుకున్నారు. ఫెంగల్ తుఫాను బలహీనపడి అల్పపడీనంగా మారి అరేబియా సముద్రంలోకి ప్రవేశించింది. దీంతో ఇప్పట్లో వానలు మళ్లీ రావులే అని జనాలు సంబరపడ్డారు. కానీ ఇంతలో వాతావరణ శాఖ మరో సంచలన వార్త అందించింది. తాజాగా బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరక శుక్రవారం వాతావరణ శాఖ ప్రకటన జారీ చేసింది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాలో వాతావరణం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురుస్తుందని తెలిపింది. డిసెంబర్ 6,7 తేదీల్లో ఏర్పడే ఆవర్తనం దక్షిణ దిశగా పయనించే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. అది డిసెంబర్ 7 నాటికి అల్పపీడనంగా మారనున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. అది వాయువ్య దిశగా పయనించి డిసెంబర్ 12 నాటికి తమిళనాడు-శ్రీలంక తీర రేఖకు చేరుకుంటుందని అంచనా.

నేటి నుంచే సిఎం కప్ - 2024

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు సి.ఎం. కప్ - 2024 రాష్ట్రములో నిర్వహిస్తున్నామని నిజామాబాద్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి జే. ముత్తన్న తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనేవారు వెబ్ పోర్టల్ నందు తప్పక తమ పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న సి.ఎం. కప్ - 2024 లో భాగంగా నిజామాబాద్ జిల్లా గ్రామస్థాయి పోటీలు డిసెంబర్ 7 నుంచి 8వ తేదీలో రెండు రోజుల పాటు జరుపుతారు. గ్రామ పంచాయతీస్థాయి క్రీడలు, 1. అథ్లెటిక్స్, 2. ఫుట్బాల్, 3. కబడ్డీ, 4. కోకో, 5. వాలీబాల్, 6. యోగా విభాగాల కింద నిర్వహిస్తారు. విజేతలను మండల స్థాయికి పంపడం జరుగుతుందన్నారు. మండల స్థాయి, నిజామాబాద్ మున్సిపాలిటీ స్థాయిలో డిసెంబర్ 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు (03 రోజులు) నిర్వహిస్తారు. రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబర్ 27 నుంచి జనవరి 2 వరకు ఏడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగే క్రీడలకు పంపనున్నట్లు తెలిపారు. క్రీడలో పాల్గొనేందుకు అనే వెబ్ పోర్టల్ నందు క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమో, ఆధార్ కార్డు తప్పనిసరిగా వెబ్ పోర్టల్లో అప్లోడ్ చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి జే. ముత్తన్న తెలిపారు.

ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు ఆహ్వానించారు. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు అలహాబాద్‌లో మహాకుంభమేళా జరగనుంది. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే కుంభమేళా సందర్భంగా పవిత్ర నదుల్లో స్నానం చేయడం మంచిదని భక్తులు భావిస్తారు.ఈ క్రమంలో హైదరాబాద్ వచ్చిన యూపీ ఉప ముఖ్య మంత్రి... తెలంగాణ సీఎంను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి ఈ మహాకుంభ మేళాకు ఆహ్వానించారు. హిందూ క్యాలెండర్ ప్రకారం ప్రతి పన్నెండేళ్లకోసారి మాఘమాసం లోని అమావాస్య రోజున బృహస్పతి మేషరాశిలోకి ప్రవేశించినప్పుడు కుంభమేళా జరుపుకుంటారు.

26 మంది చిన్నారులపై
పిచ్చికుక్క దాడి

మహబూబ్‌నగర్‌లో ఘటన

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): మళ్లీ పిచ్చికుక్కల దాడులు మొదలయ్యాయి. నిన్నమొన్నటి వరకు కంటిపై కునుకు లేకుండా చేసిన కుక్కలు మళ్లీ దాడులకు తెగబడుతున్నాయి. తాజాగా మహబూబ్‌నగర్‌లో ఓ కుక్క ఏకంగా 24 మంది పిల్లలపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచింది. మహబూబ్‌నగర్ పట్టణంలో గురువారం రాత్రి 7 నుంచి 8.30 గంటల ప్రాంతంలో గోల్ మజీద్, పాత పాలమూరు ఏరియాలో ఓ పిచ్చికుక్క స్థానికులను భయకంపితులను చేసింది. చిన్నారుల వెంట పడి కరుస్తూ పలువురిని గాయపరిచింది. పిచ్చికుక్క దాడిలో దాదాపు 24 మంది చిన్నారులు గంటల వ్యవధిలోనే గాయపడ్డారు. చిన్నారులందరికీ జనరల్ ఆస్పత్రిలో టీటీ ఏఆర్‌వీ టీకాలు ఇచ్చారు.

వైఎస్ భాస్కర్ రెడ్డికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ,డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): వైఎస్ భాస్కర్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. వైఎస్ వివేకా హత్య కేసులో నిందితుడు భాస్కర్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు నిర్ణయాన్ని తొలుత సీబీఐ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. సీబీఐ సవాలు చేసిన తరువాత భాస్కర్ రెడ్డి బెయిల్ రద్దుపై వివేకా కుమార్తె సునీతా మరో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ప్రతివాదులైన భాస్కర్ రెడ్డి, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. గతంలో సీబీఐ దాఖలు చేసిన భాస్కర్ రెడ్డి బెయిల్ రద్దు పిటీషన్‌తో సునీతా పిటీషన్‌ను ధర్మాసనం జతచేస్తూ.. తదుపరి విచారణను మార్చి మొదటి వారానికి వాయిదా వేసింది. కాగా వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును సీబీఐ విచారిస్తోంది. దాదాపు హత్య జరిగి ఐదేళ్లు గడిచినా ఈ దారుణానికి ఒడిగట్టింది

ఎవరనే దానిపై అధికారికంగా స్పష్టత రాలేదు. ఈ హత్య చేసిందేవరో కోర్టు తుది తీర్పు తర్వాతనే తేలనుంది. సీబీఐ సుదీర్ఘకాలంగా కేసును విచారిస్తోంది. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి అరెస్ట్ తర్వాత ఈ కేసు విచారణలో స్పీడ్ తగ్గింది. భాస్కర్ రెడ్డికి హైకోర్టు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని కోరుతూ సీబీఐ సుప్రీంలో పిటీషన్ దాఖలు చేసింది. దీనిపై గత నెల నవంబర్ 29న సిజెఐ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. అనంతరం భాస్కర్ రెడ్డికి నోటీసులు జారీచేస్తూ... తదుపరి విచారణ మార్చికి వాయిదా వేసింది. వివేకా హత్య కేసులో మరో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వైఎస్ భాస్కర్ రెడ్డి తనయుడు, కడప ఎంపీ అవినాష్ రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్ట్ చేయడానికి ప్రయత్నించినా.. కుదరలేదు. చివరికి తెలంగాణ హైకోర్టులో ఆయన ముందస్తు బెయిల్ పొందడంతో అవినాష్ అరెస్ట్ విషయం వెనక్కి వెళ్లిపోయింది. ఇంత జరుగుతున్నా.. వివేకానంద రెడ్డి హత్య ఎందుకు జరిగింది.. ఈ హత్యలో ఎవరు పాత్రదారులు.. ఎవరు సూత్రదారులు అనేది రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. చట్టప్రకారం దర్యాప్తు సంస్థలు విచారణ పూర్తి చేసి సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించిన తర్వాత.. న్యాయస్థానం తీర్పు తర్వాత ఈ హత్యలో దోషులు ఎవరో అధికారికంగా తేలుతుంది. జగన్మోహన్ రెడ్డి అవినాష్ రెడ్డిని కాపాడుతూ వస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అవినాష్ రెడ్డిని కస్టడీలోకి తీసుకుని సీబీఐ అధికారులు విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని.. అదే జరిగితే మాజీ సీఎం జగన్‌తో పాటు ఆమె భార్య భారతి ఇరుక్కునే అవకాశం ఉండటంతోనే అవినాష్ రెడ్డిని జగన్ కాపాడుతున్నారనే చర్చ జరుగుతోంది. ఎంపీ టికెట్ కోసమే ఈ హత్యను చేసినట్లు కేసులోని కొందరు సాక్ష్యులు, నిందితులు ఇప్పటికే చెప్పారు. దీంతో ఈ విషయం బయటకు వస్తే వైసీపీతో పాటు జగన్ రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉండటంతోనే జగన్ నిందితులకు అండగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది.

డిప్యూటీ సీఎంపై పొగడ్తలు

ఎక్స్ వేదికగా విజయసాయిరెడ్డి ట్వీట్

అమరావతి, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): నిత్యం ట్విటర్‌లో చురు కుగా ఉండి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలతో పాటు దేశ, ప్రపంచ రాజకీయాలపై ట్వీట్ చేస్తున్న వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి తాజాగా మరో ట్వీట్ చేసి ఆసక్తి రేపాడు. ఏపీలో ముఖ్యమంత్రి చంద్ర బాబు పాలనను పరోక్షంగా విమర్శిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై పొగడ్తల వర్షం కురిపించాడు. ఆంధ్రప్రదేశ్‌ను 'యంగ్ స్టేట్' గా పోలుస్తూ రాష్ట్రాన్ని 75 ఏళ్ల వయస్సుగల చంద్రబాబు నాయకత్వం ఇక అనవరసరమంటూ వ్యాఖ్యనించారు. పవన్‌కల్యాణ్‌కు జాతీయ స్థాయిలో ఉన్న పాపులారిటీ ,అతని వయసు దృష్ట్యా ఏపీకి నాయకత్వం వహించే సామర్థ్యం ఉందని తాను నమ్ముతున్నానని పేర్కొన్నారు.

తిరుమలలో పెరిగిన రద్దీ

తిరుమల,డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టీబీసీ క్యూలైన్ వరకు వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న శ్రీవారికి 21,560 మంది తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 2.97 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. కాగా తిరుపతిలోని తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి అమ్మవారు మహారాణీ అలంకారంలో అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. వాహనసేవల్లో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో జె.శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్ పాల్గొన్నారు.

పుత్తూరు నుంచి అత్తిపట్టు.. కొత్త రైల్వే మార్గం

తిరుపతి, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): పుత్తూరు నుంచి తమిళనాడులోని అత్తిపట్టు కొత్త రైల్వే మార్గం కోసం భూసేకరణ పనులకు రైల్వే శాఖ అనుమతిచ్చింది. 88 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ రైల్వే లైనుకు 189 హెక్టార్ల భూములను సేకరించాల్సి వుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెన్నై రైల్వేజోన్‌లో పుత్తూరు-అత్తిపట్టుతో పాటు 185 కిలోమీటర్ల దిండివనం-తిరువణ్ణామలై, 36కిలోమీటర్ల మోరంపూర్-ధర్మపురి,41 కిలోమీటర్ల మన్నార్‌గుడి-పట్టుకోటై, 52 కిలోమీటర్ల తంజావూరు- పట్టుకోటై లైన్ల భూసేకరణకు రైల్వే శాఖ అనుమతి ఇచ్చింది. చెన్నై హార్బర్‌లో ఎగుమతులు, దిగుమతుల వత్తిడి ఎక్కువ కావడంతో ప్రత్యామ్నాయంగా అత్తిపట్టు హార్బర్‌ను కేంద్రం ఎంపిక చేసింది. బళ్లారి నుంచి ఎగుమతయ్యే ఇనుప ఖనిజాన్ని భవిష్యత్తులో అత్తిపట్టు హార్బర్‌కు మళ్లిస్తారు. ఈ కొత్త రైల్వే మార్గం నారాయణవనం, పిచ్చాటూరు,నాగలాపురం మండలాల మీదుగా అత్తిపట్టుకు చేరుతుంది. ఈ కొత్త రైలు మార్గం రూపుదాల్చితే ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

వైభవంగా అమ్మవారి పంచమీ తీర్థం

తిరుపతి, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అఖరు రోజు శుక్రవారం పంచమి తిథిని పురస్కరించుకుని అశేష భక్తజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. పద్మ పుష్కరిణిలో స్నానం ఆచరించిన భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని పొందారు. ముందుగా పంచమి తీర్థ మండపంలో అమ్మవారికి, చక్రత్తాళ్వార్‌కు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అలంకరించిన పూలమాలలు, కిరీటాలు భక్తులకు కనువిందు చేశాయి. అంతకుముందు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఈవో, అదనపు ఈవోలకు టీటీడీ తరుపున సారెను అందజేశారు. సారెకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు-కుంకుమ, చందనం, పట్టుచీరతో పాటు రూ కోటి 20 లక్షలతో వెచ్చించి ప్రత్యేకంగా తయారు చేయించిన స్వర్ణ కిరీటం, వజ్రాలహారం, గాజులు, దుద్దెలు సారెగా సమర్పించారు.

జాతీయ రహదారులకు ప్రాధాన్యం

1,046 కోట్లతో 18 ఫ్లైఓవర్ల నిర్మాణాలు: గడ్కరీ

అమరావతి,డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): రూ.1,046 కోట్ల నిధులతో ఏపీలో జాతీయ రహదారులపై చేపట్టిన 18 ఫ్లైఓవర్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి లోక్ సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఏపీలో వంతెనల నిర్మాణాల పురోగతిపై ఆయన వివరాలు తెలియజేశారు. ఎన్‌హెచ్ - 216పై మోరంపూడి, జొన్నాడ, ఉండ్రాజవరం జంక్షన్, తెతలి, కైకరం వద్ద నిర్మిస్తున్న ఐదు వంతెనలు 2025 ఏప్రిల్ 2నాటికి పూర్తి అవుతాయని తెలిపారు. గుంటూరు మిర్చి యార్డ్ వద్ద నిర్మిస్తున్న వంతెన జనవరి 6నాటికి, విశాఖపట్నం ఎయిర్ పోర్టు జంక్షన్ వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ 2025 ఫిబ్రవరి 15కి, ఎన్‌హెచ్ - 16పై గొలగపూడి జంక్షన్, నెల్లూరు టీ జంక్షన్‌లో నిర్మిస్తున్న రెండు వంతెనలు 2025 సెప్టెంబర్ 11 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఎన్‌హెచ్ 16పై నాగులుప్పలపాడు గ్రోత్ సెంటర్, రాజుపాలెం జంక్షన్ వద్ద తలపెట్టిన వంతెనల నిర్మాణాలకు అనుమతి ఉత్తర్వులు ఇచ్చామని, ఇదే జాతీయ రహదారిలో రాజుపాలెం క్రాస్ రోడ్డు, జొన్నతాళి క్రాస్ రోడ్డు, చెవ్వూరు క్రాస్ రోడ్డు, రణస్థలం టౌన్ పోర్షన్‌తో పాటు ఎన్‌హెచ్ - 44 పై కియా వద్ద తలపెట్టిన ఫ్లైఓవర్ల నిర్మాణానికి బిడ్లు పిలిచామని వివరించారు. ఎన్‌హెచ్ 16లో శ్రీసిటీ జీరో పాయింట్, చిల్లకూరు సెంటర్ వద్ద తలపెట్టిన వంతెన నిర్మాణాలకు బిడ్లు పిలవాల్సి ఉందని గడ్కరీ తెలిపారు.

రేషన్ బియ్యం
అక్రమ తరలింపుపై ఉక్కుపాదం

దోషుల్ని పట్టుకునేందుకు ఏపీలో సిట్ ఏర్పాటు

అమరావతి,డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ లో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు మొత్తం 13ఎఫ్ఐఆర్‌లు నమోదవగా..వాటిపై లోతుగా దర్యాప్తు చేసి ఈ రేషన్ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని బయటకు లాగేందుకు ప్రత్యేక శ్రద్ధచూపుతోంది.ఇందులో భాగంగానే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేకమైన సిట్ ను ఏర్పాటు చేసింది. ఆరుగురు పోలీసు ఉన్నతాధికారులతో ఏర్పాటైన ఈ సిట్‌కు చీఫ్‌గా వినీత్ బ్రిజ్ లాల్‌ని నియమించింది. సిట్ బృందంలో ఇద్దరు ఐపీఎస్‌లు, నలుగురు డీఎస్పీలు ఉంటారు. ఇప్పటి వరకు నమోదైన ఎఫ్ఐఆర్‌లపై లోతుగా దర్యాప్తు చేసి 15రోజులకు ఒకసారి ప్రభుత్వానికి సిట్ నివేదిక ఆంధ్రప్రదేశ్‌లో ఉచితంగా సప్లై చేసే రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని కొందరు అక్రమార్కులు.. అడ్డదారిలో దేశం నుంచే దాటిస్తున్నారని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే గత నెల రోజుల నుంచి కాకినాడ పోర్టు ద్వారా అక్రమంగా ఆఫ్రికాతో పాటు మరికొన్ని దేశాలకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా గుర్తించింది. దీనిపై ఇప్పటికే పకడ్బంది ఏర్పాట్లు చేసింది. ఒక షిప్‌ను కూడా సీజ్ చేసింది.తాజాగా ఈ అక్రమ రేషన్ వ్యవహారాన్ని పూర్తిగా బయటపెట్టేందుకు ప్రభుత్వం ఉమాహేశ్వర్ ,అశోక్ వర్గన్, బాలసుందరరావు , గోవింద రావు, రత్తయ్య అనే ఆరుగురు ఉన్నతాధికారులో ప్రత్యేకంగా సిట్ ను ఏర్పాటు చేసింది. ఈ ఆరుగురిలో ఇద్దరు ఐపీఎస్ లు, నలుగురు డీఎస్పీలు ఉన్నారు. ఆరుగురు అధికారులో ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించింది ప్రభుత్వం.ఈ సిట్‌కు చీఫ్‌గా వినీత్ బ్రిజ్ లాల్‌ని నియమించింది. రేషన్ అక్రమాలతో పాటు విదేశాలు, ఆఫ్రికా కంట్రీస్‌కు తరలిస్తున్నట్లుగా నమోదైన ఎఫ్ఐఆర్‌లపై సిట్ రోజు విచారించనుంది. ప్రతి 15రోజులకు ఒకసారి దీనిపై కేసు పురోగతిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. అంతేకాదు ఈ రేషన్ అక్రమాలపై దోషులుగా తేలిన వ్యక్తులను అరెస్ట్ చేసే అధికారాన్ని కూడా సిట్ కు అప్పగించింది ప్రభుత్వం.

డీప్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు

అమరావతి,డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): ఏపీలో డీప్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సీఎం చంద్రబాబు అన్నారు. వంద శాతం గ్రీన్ ఎనర్జీకి వెళ్ళాలి అనేది మా ప్రభుత్వం లక్ష్యమని వెల్లడించారు. విశాఖపట్నంలో నిర్వహించిన డీప్‌టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ మారాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం సాంకేతికతను అందిపుచ్చుకుంటుందని పేర్కొన్నారు. టెక్నాలజీ జీవితంలో ఒక భాగంగా మారిందని అన్నారు. ఐటీ, నాలెడ్జ్ ఎకానమీలో యువత సమర్థులుగా మారుతున్నారని, విదేశాల్లోని మన దేశ ఐటీ నిపుణులుఓ 30శాతం తెలుగువారే ఉ

ండడం గర్వకారణమని వెల్లడించారు. ఎన్ని ఎక్కువ ఉద్యోగాలు ఇస్తే, అన్ని ఎక్కువ రాయితీలు మా ప్రభుత్వం ఇస్తుందని , పెట్టుబడులతో వస్తున్న వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. నదుల అనుసంధానంతో నీటి కొరత అనేదే ఉండదు. ఆహార ఉత్పత్తులు, సరఫరాలో గ్లోబల్ హబ్ గా ఏపీ మారబోతోందని తెలిపారు. అరకు కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందని అన్నారు. రాష్ట్రానికి ఉన్న వనరుల్లో తీరప్రాంతం ఒకటని, తీర ప్రాంతాన్ని పారిశ్రామికంగా పరుగులు పెట్టిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెరగడంతో పాటు రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. గత ప్రభుత్వ నిర్వాకంతో వచ్చిన అనేక సమస్యలను అధిగమిస్తున్నామని, . సెకండ్ క్వార్టర్ లో, దేశ గ్రోత్ రేట్ 8 % అయితే, ఆంధ్రప్రదేశ్ గ్రోత్ రేట్ 8.75% కి వచ్చామని తెలిపారు.

పోలవరంపై ఒడిశా అసెంబ్లీలో చర్చ

అమరావతి,డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): ఏపీలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుపై ఒడిశా అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ శీతాకాల సమావేశాల్లో ఈ అంశం ఆ రాష్ట్ర అసెంబ్లీని వేడెక్కిస్తోంది. ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్ ఏమన్నారంటే.. " రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఎప్పుడూ పోరాడింది. భవిష్యత్తులో కూడా మేము ఈ పోరాటం కొనసాగిస్తాం ఒడిశాలో అధికార పక్షంగా బీజేపీ ఉండటం.. ఏపీలోని కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఉండటంతో.. ఒడిశాలో పాలక పక్షం.. పోలవరం అంశంపై గట్టిగా ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని పరిస్థితి ఉంది. ఏపీ ప్రభుత్వంలో కీలక పార్టీగా ఉన్న టీడీపీ అవసరం కేంద్రంలో బీజేపీకి బాగా ఉంది. దాంతో.. కేంద్రం పోలవరం ప్రాజెక్టుకి అనుకూలంగా ఉంది. ఈ పరిస్థితులను ప్రతిపక్ష బీజేడీ క్యాష్ చేసుకొని.. అసెంబ్లీని వేడెక్కిస్తోంది. ఈ పరిస్థితుల్లో స్పీకర్.. అసెంబ్లీని సాయంత్రం 4 గంటల వరకూ వాయిదా వేశారు.ఈ మధ్య బీజేడీకి చెందిన నేతలు, కొంతమంది పర్యావరణ, గిరిజన వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులు

కలిసి.. ఒక బృందంగా ఢిల్లీకి వెళ్లారు. పోలవరం ప్రాజెక్టుపై అభ్యంతరాలను కేంద్రానికి తెలిపారు. పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తే, ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాపై తీవ్ర ప్రభావం పడుతుందనీ, గిరిజనులు నివసించే చాలా ప్రాంతాలకు ముంపు ప్రమాదం ఏర్పడి, వారిని అక్కడి నుంచి వేరే ప్రాంతాలకు తరలించాల్సి వస్తుందని ఆ బృందం తెలిపింది. అంతే కాదు ఈ బృందం కేంద్ర జలశక్తి మంత్రి సీ ఆర్ పాటిల్‌ని కూడా కలిసి.. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరింది. పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం.. ముంపు ప్రాంతాలపై ఎలా ఉంటుందో మరోసారి అధ్యయనం చెయ్యాలని కోరింది. కేంద్ర ప్రభు త్వం పోల వరం నిర్మాణానికి అను కూలంగా ఉంది. తెలుగు రాష్ట్రాల విభజన చట్టం ప్రకారం.. పోల వరం నిర్మాణాన్ని పూర్తి చెయ్యాల్సిన బాధ్యత కేంద్రానిదే. అయితే 2014లో ఈ బాధ్యతను అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకుంది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక, ఈ ప్రాజెక్టుపై పెద్దగా కదలిక లేదు. కేంద్రం కూడా తేలిగ్గా తీసుకుంది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం దీన్ని నిర్మించేందుకు ఆసక్తిగా ఉంది. కేంద్రం కూడా సహకరిస్తామంటోంది. అందుకే ఇప్పుడు బీజేడీ.. ఈ అంశాన్ని లేవనెత్తుతూ.. బలమైన ప్రతిపక్షంగా నిలిచేందుకు ప్రయత్నిస్తోంది. ఇది ఒడిశాలోని పాలక బీజేపీకి సమస్యగా మారుతోంది.

అద్భుతంగా కాంగ్రెస్ పాలన

ఓర్వలేకే బీఆర్ఎస్ ఆరోపణలు
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి):డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు కానుంది. బీఆర్ఎస్ నేతల విమర్శలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన చాలా అద్భుతంగా కొనసాగుతోందని.. అది ఓర్వలేక బీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నా భిన్నం చేసిందని మండి పడ్డారు. ప్రజలపై భారం వేయకుండా ఆర్థిక శాఖను ముందుకు కొనసాగిస్తున్నాం అన్నారు. ప్రపంచ వాతావరణం వల్ల గ్రీన్ ఎనర్జీ పై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టిందని.. త్వరలోనే కొత్త విద్యుత్ పాలసీ తీసుకురాబోతునాం అని భట్టి విక్రమార్క అన్నారు.గత ప్రభుత్వం విద్యుత్ శాఖలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం అని తీవ్రంగా మండిపడ్డారు. ఒక్క యాద్రాద్రి భద్రాద్రి పవర్ ప్లాంట్ల వద్ద గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల ప్రతి ఏటా 170 కోట్లకు పైగా భారం పడిందన్నారు. కొంతమంది స్వార్థం వల్ల విద్యుత్ రంగంలో ఆర్థిక భారం పడుతుందని భట్టి అన్నారు. ఛత్తీస్ ఘడ్ ఒప్పందాల వల్ల 630 ఆర్థిక భారం ప్రభుత్వం పై పడుతుందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిచేసి యాదద్రిలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అనుసంధానం చేయబోతున్నాం అని అన్నారు. గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల వల్ల విద్యుత్ డిస్కంల పై దాదాపుగా 10వేల కోట్ల భారం పడుతుందని విమర్శలు గుప్పించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 24 గంటల కరెంటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. 50లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. భవిష్యత్తులో అన్ని రకాల విద్యుత్ ఉత్పత్తి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కరెంట్ కోతలు లేకుండా చర్యలు తీసుకున్నామని. అన్ని రంగాలతో కూడిన విజన్ డాక్యుమెంట్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ తయారు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా 1.28 కోట్ల దరఖాస్తులు ప్రజా పాలనలో వచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు.

జీహెచ్ఎంసీలో జీవీపీ పాయింట్స్

ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయం

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో చెత్త పెద్ద సమస్యే. చెత్తను ఎక్కడపడితే అక్కడే వేస్తున్నారు. సమస్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ అనేక చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేదు. దీంతో దుర్వాసన, దోమలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో జీహెచ్ఎంసీ కొత్త ప్రణాళికను రూపొందించేందుకు సన్నద్ధమవుతోం ది. ఐతే.. ఇందులో ఒక షాక్ కూడా ఉంది. ఈ చెత్తను సేకరించడానికి ప్రభుత్వం సిటీలో అక్కడక్కడా గార్బేజ్ వర్నరబుల్ పాయింట్ లను గుర్తించింది. ఇవన్నీ తీవ్రమైన చెత్తను పారపోస్తున్న ప్రాంతాలుగా అధికారులు గుర్తించారు. ఇక్కడ ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ముగ్గులు వేయడం, ప్రత్యేకంగా ఓ వ్యక్తిని కాపాలాగా పెట్టడం వంటి కొన్ని చర్యలను చేపట్టింది. అయినా ప్రజలు తీరు మార్చుకోవట్లేదనీ, ఏదో ఒక రకంగా చెత్త వేస్తూనే ఉన్నారని అధికారులు అంటున్నారు. గ్రేటర్‌లో చెత్త సమస్యను పరిష్కరించడానికి జీహెచ్ఎంసీ కొత్త ప్లాన్ రూపొందించింది. చెత్త పేరుకుపోకుండా, చెత్త కనిపించకుండా ఉండడానికి ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జీహెచ్ఎంసీ పరిధిలోని చాలా ప్రాంతాల్లో గార్బేజ్ కలెక్షన్ సెంటర్ పేరుతో ఆర్లెడీ ఏర్పాటు చేశారు. చెత్త వేసినప్పుడు ఆ చెత్త.. డస్ట్ బిన్‌లో పడకుండా.. కింద పడితే.. అది ప్రజలకు కనిపించకుండా ఉండేలా ఈ క్యాబిన్‌లను రూపొందించారు. తద్వారా ఆ చెత్త ఉన్న ప్రదేశం చూడటానికి అందంగానే కనిపిస్తుంది. ప్రధానంగా మురికివాడల్లో ఈ క్యాబిన్ లను మరింతగా ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. చెత్త ఎక్కువగా పేరుకుపోతున్న ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో గార్బేజ్ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది.

రాజ్యసభలో నోట్ల కలకలం

222 సీటు వద్ద రూ.500 కట్టలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎగువ సభ లో భారీగా నగదు పట్టుబడింది. ఎంపీ అభిషేక్ సింఘ్వీ సీటు వద్ద నోట్ల కట్ట లభ్యమైనట్లు రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్ తాజాగా వెల్లడించారు. సాధారణ భద్రతా తనిఖీల్లో భాగంగా గురువారం సభ వాయిదా పడిన తర్వాత సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు చైర్మన్ తెలిపారు. ఈ తనిఖీల్లో రూ.500 నోట్లతో ఉన్న నగదు కట్టను గుర్తించినట్లు చెప్పారు. సీటు నంబర్ 222 నుంచి భద్రతా అధికారులు కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ సీటు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీ అభిషేక్ మను సింఘ్వీనికి కేటాయించిందిగా గుర్తించినట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ అంశంపై విచారణకు ఆదేశించినట్లు ధన్‌ఖర్ వెల్లడించారు. మరోవైపు తాజా ఘటనపై కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అం శంలో సింఘ్వీ పేరును ప్రస్తావించడంపై మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు.

సభకు రూ.500తో మాత్రమే వెళ్లా: ఎంపీ అభిషేక్ సింఘ్వీ

రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ సీటు వద్ద గురువారం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో భారీగా నదును గుర్తించారు. ఈ అంశంపై ఇవాళ సభలో దుమారం రేగింది. అయితే ఆ ఘటన పట్ల తెలంగాణ నుంచి ఎంపీగా ఎన్నికైన సింఘ్వీ ఓ వీడియో ద్వారా ప్రకటన చేశారు. రాజ్యసభకు వెళ్తున్న సమయంలో.. ఒకే ఒక్క రూ.500 నోటు పట్టుకెళ్లుతానని సింఘ్వీ తెలిపారు. తన సీటు వద్ద నోట్ల కట్టలు ఉన్న విషయాన్ని మొదటిసారి విన్నట్లు చెప్పారు. గురువారం రోజున మధ్యాహ్నం 12.57 నిమిషాలకు సభలోకి వెళ్లానని, ఆ తర్వాత సరిగ్గా ఒంటి గంటకు సభ నుంచి బయటకు వచ్చినట్లు తెలిపారు. ఆ తర్వాత క్యాంటీన్‌లో అయోధ్య రామిరెడ్డితో కలిసి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు కూర్చున్నట్లు చెప్పారు. సభలో 3 నిమిషాలు, క్యాంటిన్‌లో 30 నిమిషాలు మాత్రమే ఉన్నానని, దీనిపై కూడా రాజకీయం చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభలో 222 సీటు నెంబర్‌ను అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించారు. అయితే ఆ సీటు వద్ద నగదు లభించిన అంశంపై విచారణ చేపట్టనున్నట్లు చైర్మెన్ ధనకర్ తెలిపారు.

మహారాష్ట్ర ప్రొటెం స్పీకర్‌గా కాళిదాస్ కొలాంబ్‌కర్

ముంబై, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): బీజేపీ సీనియర్ నాయకుడు కాళిదాస్ కొలాంబ్‌కర్ మహారాష్ట్ర అసెంబ్లీ ప్రొటెం స్పీకర్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ కొలాంబ్‌కర్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. మహారాష్ట్ర రాజ్‌భవన్‌లో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో కాళిదాస్ కొలాంబ్‌కర్ ప్రమాణస్వీకారం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో కొలాంబ్‌కర్ ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ఆ తర్వాత అసెంబ్లీకి శాశ్వత స్పీకర్‌ను, డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు. కాగా మహా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, అజిత్‌పవార్ ఎన్సీపీ, ఏక్‌నాథ్ షిండే శివసేనలతో కూడిన మహాయుతి కూటమి విజయం సాధించింది. దేవేంద్ర ఫడ్నవీస్ సీఎంగా, ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ డిప్యూటీ సీఎంలుగా ప్రమాణస్వీకారాలు చేశారు. త్వరలో నూతన అసెంబ్లీ కొలువుదీరనుంది. ఈ నేపథ్యంలో ప్రొటెం స్పీకర్‌ను నియమించి ప్రమాణ స్వీకారం చేయించారు.

వడ్డీ రేట్లు యథాతథం

రెపోరేటు 6.50 శాతంగా కొనసాగింపు.. వడ్డీ రేట్లను ప్రకటించిన గవర్నర్ శక్తికాంత దాస్



న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): దేశ ఆర్థిక వృద్ధి రేటు మందగించిన నేపథ్యంలో ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ నగదు నిల్వల నిష్పత్తిని 4.50 శాతం నుంచి 4 శాతానికి తగ్గించింది. ఈ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీని పెంచడంలో సహాయపడుతుందని, తద్వారా బ్యాంకులు వృద్ధిని వేగవంతం చేయడానికి మరింత ఎక్కువ రుణాలను పంపిణీ చేయగలవని భావిస్తున్నారు. ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం రూ.1.16 లక్షల కోట్ల నగదును పెంచడంలో దోహదపడుతుంది. సెంట్రల్ బ్యాంక్ తన పాలసీ రేటులో అంటే రెపో రేటులో ఎలాంటి మార్పు చేయలేదు. రెపో రేటు 6.50 శాతం వద్ద కొనసాగుతోందని, ఫిబ్రవరి 2023 నుండి రెపో రేటులో ఎటువంటి మార్పు లేదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది 11వసారి. 2023 ఫిబ్రవరి నుంచి కేంద్ర బ్యాంకు ఈ రేటును ఇలాగే కొనసాగిస్తూ వస్తోంది. క్యాష్ రిజర్వ్ రేషియోలో 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. నగదు నిల్వల నిష్పత్తి తగ్గింపును రెండు దశల్లో అమలు చేయనున్నారు. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.16 లక్షల కోట్ల అదనపు నగదు అందుబాటులోకి వస్తుంది. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ మూడు రోజుల సమావేశం డిసెంబర్ 4న ప్రారంభం కాగా, ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను శుక్రవారం(డిసెంబర్ 6) ప్రకటించారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, వృద్ధిని కొనసాగించడంతో పాటు ధరలను స్థిరంగా ఉంచడమే మా లక్ష్యం అని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు. అదే సమయంలో వృద్ధిని కొనసాగించడం ముఖ్యమని, ఇది ఆర్‌బీఐ చట్టంలో కూడా ఉందన్నారు. జీడీపీ వృద్ధి రేటు క్షీణతపై ఆర్‌బీఐ గవర్నర్ మాట్లాడుతూ, ఆర్థిక వృద్ధి రేటు క్షీణతకు కారణం పారిశ్రామిక ఉత్పత్తి క్షీణత. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పారిశ్రామిక వృద్ధిరేటు 7.2 శాతం కాగా, రెండో త్రైమాసికంలో 2.1 శాతానికి తగ్గింది. తయారీ రంగం వృద్ధి రేటు తగ్గిందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరిగిందని, అయితే పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గుతోందని ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. ఆర్‌బీఐ వృద్ధి రేటు అంచనాను తగ్గించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, ఆర్‌బిఐ జిడిపి వృద్ధి రేటు 6.6 శాతంగా అంచనా వేసింది. ఇది అంతకుముందు 7.2 శాతం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో జీపీపీ వృద్ధి రేటు 6.6 శాతంగా, నాల్గవ త్రైమాసికంలో 6.8 శాతంగా ఆర్‌బీఐ అంచనా వేసింది.

బ్యాంకు ఖాతాకు 4 నామినీలు

లోక్‌సభలో బిల్లు ఆమోదం!

న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ బిల్లు ఒక బ్యాంకు ఖాతాలో 4 నామినీలను జోడించడానికి అందిస్తుంది. కొత్త బ్యాంకింగ్ చట్టం బిల్లులో డిపాజిటర్లకు మెరుగైన రక్షణ, ప్రైవేట్ బ్యాంకుల్లో మెరుగైన సేవలందించే అంశాలు కూడా ఉన్నాయి. క్లెయిమ్ చేయని షేర్లు, బాండ్‌లు, డివిడెండ్‌లు, వడ్డీ లేదా రిడెంప్షన్ ఆదాయాలను విద్య నిధికి బదిలీ చేయడానికి బిల్లు సులభతరం చేస్తుంది. ఇది పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడుతుంది. బదిలీ, వాపసు క్లెయిమ్‌ల కోసం సౌకర్యాన్ని అందిస్తుంది. బిల్లులోని ఇతర ముఖ్యమైన సవరణలు బ్యాంక్ డైరెక్టర్ల కోసం గణనీయమైన వడ్డీని అందుకోవడం గురించి కూడా ఉన్నాయి. దాదాపు ఆరు దశాబ్దాలుగా ఎలాంటి మార్పు లేకుండా ఉన్న ఈ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచాలనే నిబంధన బిల్లులో ఉంది.కోవిడ్ 19 మహమ్మారి కారణంగా ఏర్పడిన సమస్యల తర్వాత బ్యాంకింగ్ చట్ట సవరణ బిల్లులో ఈ ప్రధాన మార్పులు చేశారు. ఇప్పుడు ఒక నామినీకి బదులుగా 4 నామినీలు యాడ్ చేసేందుకు అనుమతి ఉంటుంది. ఖాతాదారుడు మరణించిన తర్వాత డబ్బు ఉపసంహరణను సులభతరం చేయడం దీని ఉద్దేశ్యం.డిపాజిటర్లు ఏకమొత్తం నామినేషన్‌ను ఎంచుకోవడానికి బిల్లు అనుమతిస్తుంది. నామినీకి నిర్ణీత శాతం షేర్లు లేదా సీక్వెన్షియల్ నామినేషన్ కేటాయించబడిన చోట నామినీ వయస్సు ప్రకారం బ్యాంకులో డిపాజిట్ చేసిన మొత్తం అందిస్తారు. ఈ మార్పు హోమ్ లోన్‌లకు యాక్సెస్‌ను సులభతరం చేస్తుందని, బ్యాంకింగ్ ప్రక్రియలలో ఆలస్యం తగ్గుతుందని భావిస్తున్నారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాత బ్యాంకులు తమ నివేదికలను ప్రతి శుక్రవారం కాకుండా ప్రతి పక్షం రోజుల చివరి రోజున రిజర్వ్ బ్యాంక్‌కు సమర్పిస్తాయి. దీనితో పాటు నోటిపై చేయని బ్యాంకులు మిగిలిన నగదు నిల్వలను నిర్వహించాలి. సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌ను రాష్ట్ర సహకార బ్యాంకు బోర్డులో పనిచేయడానికి కూడా బిల్లు అందిస్తుంది.బిల్లులో మరో ముఖ్యమైన మార్పు చేసినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పటి వరకు ఏడేళ్లపాటు ఖాతాలో ఎలాంటి లావాదేవీలు లేకుంటే అది ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ సవరణ తర్వాత ఖాతాదారుడు ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ నుండి మొత్తం రీఫండ్‌ను క్లెయిమ్ చేయవచ్చు.

బంగ్లాదేశ్ విభజించి హిందువులకు కొత్త దేశాన్ని ఇవ్వాలి

మాజీ ఆర్మీ చీఫ్ సంచలన డిమాండ్



న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): బంగ్లాదేశ్‌లో హిందువులపై వేధింపులు కొనసాగుతున్నాయి. మైనార్టీలపై దాడులు, ఇళ్లను ధ్వసం చేస్తున్న సంఘటనలకు సంబంధించిన వార్తలు నిత్యం వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ పరిస్థితిపై భారత ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. అదే సమయంలో పలువురు హిందువుల కోసం ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలంటూ నినాదాలు వినిపిస్తున్నాయి. బంగ్లాదేశ్ హిందువుల కోసం 'హిందూదేశ్' సృష్టించాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ డిమాండ్ చేస్తోన్న వారు మరెవరో కాదు మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ జిడి బక్షి. ఈ విషయాన్నీ పోస్ట్ చేసి బంగ్లాదేశ్ ఏర్పడం కోసం భారతీయ సైనికుల త్యాగాలను గుర్తు చేశారు.హిందువులను రోజుకో రకంగా దారుణంగా చిత్రహింసలకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. దీంతో యుకే పార్లమెంట్ లో తమ మౌనం వీడగా ట్రంప్ మంత్రి వర్గంలోని వారు కూడా ఇప్పటికే స్పందించారు. అయితే తాజాగా మాజీ ఆర్మీ రిటైర్డ్ జనరల్ జీడీ బక్షి కూడా నోరు విప్పారు. బంగ్లాదేశ్‌లోని హిందువుల కోసం ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముహమ్మద్ యూనస్ నాయకత్వంలో బంగ్లాదేశ్ రాడికల్ జిహాదీ దేశంగా మారింది. మారణహోమం సృష్టించి.. తమ దేశంలో ఉన్న మైనారిటీ హిందువులను దేశం నుంచి తరిమికొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని.. యుద్ధానికి సిద్ధమయ్యారన్నారు. పాకిస్తాన్ ఏలుబడిలో ఉన్న సమయంలో 1971లో 3800 మందికి పైగా భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళ సిబ్బంది పోరాడి బంగ్లాదేశ్ ఏర్పాటు చేసింది. పాక్ సైన్యం నుంచి బంగ్లాదేశ్ ను విడిపించేందుకు ఎందరో భారతీయు సైనికులు తమ ప్రాణాలను అర్పించారు. అయితే వీరు అసలు కృతజ్ఞత లేని వారు..అందుకే హిందూ మైనారిటీలను అంతం చేయాలనుకునే దిశగా నడుస్తున్నారు. కనుక ఇప్పుడు ఈ సమస్యకు సరైన సాధ్యమైన మార్గం..దేశాన్ని రెండుగా విడగొట్టి.. హిందూస్తాన్ ను ఏర్పాటు చేయమే అని చెప్పారు. ఈ పోస్ట్ తో పాటు బంగ్లాదేశ్ మ్యాప్ చిత్రాన్ని పోస్ట్ చేశారు. ఆ మ్యాప్ లో బంగ్లాదేశ్ ఉత్తర భాగాన్ని విభజించి హిందూ దేశ్ గా ఏర్పాటు చేయమని సూచిస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రాథమికంగా రంగ్‌పూర్, దినాజ్‌పూర్‌లను ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలని జనరల్ జీడీ బక్షి డిమాండ్ చేశారు.

డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదు

వేరే కరెన్సీని ఉపయోగించే దేశాలపై పన్నులు: ట్రంప్



న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): అంతర్జాతీయ వ్యాపారంలో డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. డాలర్ స్థానంలో వేరే కరెన్సీని ఉపయోగించే దేశాలపై పన్నులు పెంచుతామని చెప్పారు. అమెరికాకు ఆ దేశాలు ఉత్పత్తి చేసే వస్తువులపై పన్నులు 100 శాతం పెంచుతామని స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాల ప్రయత్నాలను తాము ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటామని, డాలర్‌కు దూరంగా జరిగే దేశాలకు అమెరికా ఆర్థిక వ్యవస్థలో చోటుండదని హెచ్చరించారు. అమెరికాకు ఎగుమతుల విషయం మర్చిపోవాల్సి వస్తుందని వివరించారు. అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సులో అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీ వాడాలని నిర్ణయించాయి. దీనివల్ల స్థానిక కరెన్సీ బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డాయి. ఈ సమావేశంలో ఈజిప్ట్, ఇరాన్, యూఏఈ ఈ ప్రతిపాదనకు అంగీకారం తెలిపాయి. ఓ డిక్లరేషన్‌పై బ్రిక్స్ దేశాలు సంతకం చేశాయి. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ ఇండియా సహా బ్రిక్స్ దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు.

ప్రపంచం ముంగిట మరో పెనుముప్పు

దడపుట్టిస్తున్న బ్లీడింగ్ ఐ వైరస్

15 రోజుల్లో 150 మంది మృత్యువాత

చికిత్సలేక ఇళ్లలోనే చనిపోతున్న జనాలు



న్యూఢిల్లీ, డిసెంబర్ 6 (ఋషి ప్రతినిధి): ప్రపంచ దేశాలు 'బ్లీడింగ్ ఐ వైరస్' మహమ్మారికి గజగజ వణకుతున్నాయి. ప్రస్తుతం ఆఫ్రికాను వేధిస్తున్న ఈ వైరస్ అక్కడి నైరుతి కాంగోలో తొలిసారి బయటపడింది. ఈ అంతుచిక్కని వ్యాధి కాంగోలోని క్వాంగో ప్రావిన్సులో మారణహోమాన్ని సృష్టిస్తుంది. కేవలం 15 రోజుల్లో దాదాపు 150 మందిని పొట్టనబెట్టుకుంది. దీంతో ఆ దేశ ఆరోగ్య అధికారులు హెల్త్ ఎమర్జెన్సీ జారీ చేశారు. నవంబర్ 10 నుంచి నవంబర్ 25 మధ్య కాంగో ప్రావిన్స్‌లోని పాంజీ హెల్త్ జోన్‌లో ఈ మరణాలు సంభవించాయి. అంతుచిక్కని మరణాలను గల కారణాలను అన్వేషించడానికి రోగుల నుంచి నమూనాలు సేకరించేందుకు ఒక వైద్య బృందం పాంజీ హెల్త్ జోన్ చేరుకుంది. అక్కడి ప్రాంతీయ ఆరోగ్య మంత్రి అపోలినైర్ యుంబా ప్రకారం. దీని అనారోగ్య లక్షణాలు ఫ్లూని పోలి ఉన్నట్లు తెలిపారు. రోగుల్లో అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, దగ్గు, రక్తహీనత వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. దీనికి చికిత్స అందుబాటులో లేకపోవడంతో అనేక మంది రోగులు తమ ఇళ్లలోనే మృత్యువాత పడుతున్నారు. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని ఆరోగ్య అధికారులు సమస్యాత్మక ప్రదేశాల్లో జనాల అనారోగ్యంపై నిఘా ఉంచారు. ఇది అంటువ్యాధని, మృతదేహాల దరిదాపుల్లోకి కూడా ఎవ్వరూ రావొద్దంటూ అక్కడి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఇక్కడి ఆరోగ్య సమస్యను పరిష్కరించడానికి, వైద్య సామాగ్రిని సరఫరా చేయాలని ఆరోగ్య మంత్రి అపోలినైర్ యుంబా దేశీయ, విదేశీ భాగస్వాముల సహాయం కోరారు. రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. స్థానిక ఎపిడెమియాలజీ ప్రకారం, ఈ వ్యాధి మహిళలు, పిల్లలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్లు పేర్కొంది. మరణాల సంఖ్య వేగంగా పెరుగుతోందని, ఒక్క నవంబర్ 25వ తేదీన దాదాపు 67 మరణాలు నమోదైనట్లు అక్కడి ఆరోగ్య అధికారులు వెల్లడించారు. చైనా నుంచి శరవేగంగా ప్రపంచ దేశాలకు ప్రయాణించిన కోవిడ్ -19 వ్యాప్తితో కోట్లాది మంది ప్రాణాలు వదిలారు. కాంగోలో విజృంభిస్తున్న ఈ కొత్త వైరస్‌ను కట్టడి చేయకుంటే మరోమారు ప్రమదం ముంచుకొచ్చే అవకాశం ఉందని ప్రపంచదేశాలు ఆందోళన చెందుతున్నాయి.

కయ్యారి చిత్రం

• శ్రీశైలంలో నాగచైతన్య, శోభిత

అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల వివాహ బంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వీరి వివాహ అంగరంగ వైభవంగా జరిగింది. తాజాగా నూతన జంట శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. అక్కినేని నాగార్జునతో కలిసి చైతూ-శోభిత జంట శుక్రవారం శ్రీశైలం వెళ్లారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వీరికి అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనం చేశారు.

షారుఖ్‌ఖాన్ రికార్డు బద్దలు

అల్లు అర్జున్ -సుకుమార్ కాంపౌండ్ నుంచి వచ్చిన మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. ఈ పాన్ ఇండియా సినిమా తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై రికార్డుల వేట మొదలుపెట్టింది. పుష్ప 2 ది రూల్ రిలీజైన్ అన్ని సెంటర్లలో దాదాపు హౌస్‌ఫుల్ షోలతో విజయవంతంగా స్ట్రీనింగ్ అవుతోంది. ఇప్పటికే ఓపెనింగ్ డేన నైజాం ఏరియాలో ఈ

చిత్రం రూ.30 కోట్లు షేర్ రాబట్టి.. ఆర్ఆర్ఆర్ (రూ.23.38 కోట్లు)పై ఉన్న రికార్డును అధిగమించినట్టు వార్తలు వచ్చాయి. తాజాగా మరో అరుదైన ఫీట్‌ను ఖాతాలో వేసుకుందని బీటౌన్ సర్కిల్ కథనం. జవాన్ ఫస్ట్ డే రూ.65 కోట్లు వసూళ్లు రాబట్టగా.. పుష్ప 2 రూ.67 కోట్లతో రికార్డ్‌ను బీట్ చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఈ లెక్కన పుష్ప 2 బాక్సాఫీస్ రికార్డుల మోత ఖాయమని పుష్పరాజ్ చెప్పకనే చెబుతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.

పుష్ప-2 మ్యూజిక్‌లో 90% నాదే :శ్యామ్‌సీఎస్

పుష్ప 2 ది రూల్ కంపోజిషన్ వచ్చేసరికి మేకర్స్‌కు, డీఎస్పీకి మనస్పర్థలు వచ్చాయని ఇప్పటికే నెట్టింట వార్తలు కూడా రౌండప్ చేస్తున్నాయి. ఎవరూ క్రెడిట్ ఇవ్వరని, తీసుకోవాల్సిందేనని, అది పేమెంట్ అయినా, స్క్రీన్‌పై క్రెడిట్ అయినా తప్పదని పుష్ప 2 ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కామెంట్స్ కూడా చేశాడు దేవీ శ్రీ ప్రసాద్. తాజాగా పుష్ప 2కు పనిచేసిన మరో మ్యూజిక్ డైరెక్టర్ శ్యామ్ సీఎస్ కామెంట్స్ హాట్ టాపిక్‌గా మారాయి. పనిని మొదలుపెట్టేముందు నేను స్క్రిప్ట్‌ను చదవలేదు. ఎందుకంటే ఎడిటింగ్ అయిన తర్వాత టీంలో జాయిన్ అయ్యా. అయితే నేను సినిమా మొత్తానికి సంగీతం అందించా. దేవీ శ్రీ ప్రసాద్ సంగీతంలో మేకర్స్ కొంత భాగాన్ని ఉంచినప్పటికీ.. క్లైమాక్స్ ఫైట్‌తోపాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌లో 90 శాతం క్రెడిట్ నాదే. పుష్ప 2 భారీ ప్రాజెక్ట్. ప్రేక్షకుల దృష్టికోణంలోనే సినిమాను తెరకెక్కించా. నేను పుష్ప 2 కోసం పైపు పరికరాలను ఉపయోగించాను. ఏఐని ఉపయోగించి వాయిస్‌ని సృష్టించి.. దాని ఇన్‌స్ట్రుమెంటల్‌గా మార్చాను. ఇది ఫ్రెష్ సౌండ్ ఫీల్ ఇస్తుంది. ప్రజలు ఈ సంగీతాన్ని ఆస్వాదిస్తారని ఆశిస్తున్నామని చెప్పుకొచ్చాడు శామ్ సీఎస్. అయితే ఈ సినిమా దేవిశ్రీ ప్రసాద్‌దేనని చెప్పిన శ్యామ్.. నిర్మాణ పనులు త్వరగా ముగించాల్సి రావడంతో మేకర్స్ తనను టీంలోకి తీసుకొచ్చారని చెప్పాడు. పాటలు లేటని, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ లేటని తనను అంటూనే ఉంటారని.. ఇప్పుడు కూడా ఫంక్షన్‌కు ఆలస్యంగా వచ్చానని ఫీలయ్యారని, ఈ విషయంలో తననేం చేయమంటారని

తనదైన స్టైల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చురకలంటించాడు డీఎస్పీ. ఎవరూ క్రెడిట్ ఇవ్వరని, తీసుకోవాల్సిందేనని, అది పేమెంట్ అయినా, స్క్రీన్‌పై క్రెడిట్ అయినా తప్పదన్నాడు దేవీ శ్రీ ప్రసాద్. టైంకు పాట ఇవ్వలేదు.. టైంకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇవ్వలేదు. టైంకు ప్రోగ్రామ్ రాలేదని ఎక్కువ కంప్లైట్స్ చేస్తూ ఉన్నాయి. మీకు నా మీద ప్రేమ ఉంది. ఆ ప్రేమ ఉన్నప్పుడు కంప్లైంట్స్ కూడా ఉంటాయన్నాడు డీఎస్పీ.

ఇక బెన్‌ఫిట్స్‌షోలు ఉండవు: మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో బుధవారం రాత్రి పుష్ప 2 బెనిఫిట్ షో నేపథ్యంలో అల్లు అర్జున్ రాక సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి (39) అనే మహిళ మృతి చెందగా. ఆమె కుమారుడు శ్రీతేజ్ (9) గాయాలపాలై నిమ్స్?హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ టీం, థియేటర్ యాజమాన్యంపై కేసు కూడా నమోదు చేశారు పోలీసులు. తొక్కిసలాట ఘటన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం షాకింగ్ నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ఇక కొత్తగా విడుదలయ్యే సినిమాలకు బెన్‌ఫిట్ షోలకు అనుమతించమని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇకపై తెలంగాణలో ఉదయం 7 గంటలకే తొలి షో ఉండే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో సంక్రాంతి సీజన్‌లో విడుదల సినిమాలపై ప్రభావం పడే అవకాశం బాగానే ఉంది.

సంధ్య థియేటర్ మూసివేతకు సిఫార్సు..

సంధ్య థియేటర్ ఘటనపై ఇప్పటికే డీసీపీ మాట్లాడుతూ.. సంధ్య థియేటర్ మూసివేతకు సిఫార్సు చేశాం. టిక్కెట్స్ తనిఖీల కోసం ప్రేక్షకులను ఒక్కసారిగా అనుమతించారు. థియేటర్ లోపల తొక్కిసలాటతో ఊపిరాడక అవస్థలు పడ్డారు. థియేటర్‌లో రేవతి, ఆమె కుమారుడు స్పృహ కోల్పోయారు. రేవతి చనిపోయినట్టుగా వైద్యులు నిర్ధారించారని చెప్పారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు అల్లు అర్జున్, సెక్యూరిటీ సిబ్బందిపై కేసులు నమోదు చేశాం. ముందస్తు చర్యల్లో భాగంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం.అల్లు అర్జున్ వస్తున్న విషయం మాకు చెప్పలేదు. థియేటర్ యాజమాన్యం టిక్కెట్స్ అమ్మకాలు, తనిఖీలో నిర్లక్ష్యం వహించిందని పేర్కొన్నారు.

రూమర్స్‌కు ఐశ్వర్య, అభిషేక్ చెక్

బాలీవుడ్ స్టార్ జంట ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్ విడాకులు తీసుకోబోతున్నారంటూ గత కొంత కాలంగా వార్తలు హల్‌చల్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ వార్తలపై ఇద్దరూ ఎప్పుడూ బహిరంగంగా స్పందించలేదు. తాజాగా ఈ రూమర్స్‌కు చెక్ పెడుతూ ఐశ్వర్య అభిషేక్ జంట ఒకే ఫ్రేమ్‌లో దర్శనమిచ్చారు. వీరిద్దరూ కలిసి తాజాగా ఓ ఈవెంట్‌కు హాజరయ్యారు. ఇద్దరూ బ్లాక్ డ్రెస్‌లు ధరించి ఫొటోలకు ఫోజులిస్తూ సందడి చేశారు. ఐశ్వర్య తల్లి బృంద్య, అను రంజన్‌తో కలిసి ఈ స్టార్ జంట సెల్ఫీలు దిగారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. కాగా, ఐశ్వర్యరాయ్, అభిషేక్ బచ్చన్ జంట విడాకులు తీసుకోబోతున్నదంటూ ఇటీవల వార్తలు తెగ హల్‌చల్ చేస్తున్నాయి. అభిషేక్ నటి నిమ్రత్ కౌర్‌తో రిలేషన్‌లో ఉన్నాడని.. ఈ క్రమంలోనై ఐష్ నుంచి విడిపోనున్నట్లుగా బాలీవుడ్ కోడై కూస్తున్నది. ఈ క్రమంలోనే ఏ పార్టీకి హాజరైనా బచ్చన్ ఫ్యామిలీ కుటుంబంతో సహా హాజరవుతున్నా.. ఐశ్వర్య మాత్రం కూతురు ఆరాధ్యతో కలిసి వేరుగా హాజరవడం ఈ వార్తలకు మరింత ఆజ్యంపోసినట్లయ్యింది. అలాగే, ఒక్కగానొక్క కూతురు ఆరాధ్య బర్త్ డే వేడుకలకు సైతం అభిషేక్ దూరంగా ఉన్నాడు. దీంతో ఈ జంట త్వరలో విడాకులు తీసుకోవడం ఖాయం అని అందరూ భావించారు. ఇంతలోనే ఇద్దరూ ఓ కార్యక్రమానికి హాజరై ఆ రూమర్స్‌కు చెక్ పెట్టారు.

ఓటీటీలోకి కంగువా

సూర్య హీరోగా శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కంగువా' ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. డిసెంబరు 8న ఈ

మూవీ అమెజాన్ ప్రైమ్ వేదికగా అందుబాటులోకి రానుంది. ఈ మేరకు ప్రైమ్ వీడియో ఎక్స్ వేదికగా పోస్టర్‌ను పంచుకుంది. తెలుగుతోపాటు హిందీ, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో ఇది అందుబాటులో ఉండనున్నట్లు తెలుస్తోంది. విశాపటానీ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో బాబీదేవోల్ విలన్‌గా కనిపించారు. ఫ్రాన్సిస్ (సూర్య) గోవాలో ఓ బౌంటీ హంటర్. పోలీసులు కూడా చేయలేని పనుల్ని చేసి, అందుకుగానూ వాళ్ల నుంచి డబ్బు తీసుకుంటూ కాలం గడుపుతుంటాడు. ఏంజెలా (దిశా పటానీ)దీ ఇదే పని. ఒకప్పుడు వీరిద్దరూ ప్రేమికులే. ఆ తర్వాత విడిపోయి ఎవరి దారులు వాళ్లు చూసుకుంటారు. ఫ్రాన్సిస్, తన స్నేహితుడు (యోగిబాబు)తో కలిసి ఓ బౌంటీ హంటింగ్ పనిపై ఉన్నప్పుడే జీటా అనే బాలుడిని కలుసుకుంటారు. ఫ్రాన్సిస్, జీటా కలుసుకోగానే ఇద్దరికీ ఏదో తెలియని సంబంధం ఉన్న భావన కలుగుతుంది. ఆ తర్వాత ఆ బాలుడి ప్రాణానికి ప్రమాదం ఉందని అర్థమవుతుంది. మరి జీటాని కాపాడటానికి ఫ్రాన్సిస్ ఎలాంటి సాహసాలు చేశాడు. ఈ జీటాని వెంటాడుతున్నది ఎవరు? ఫ్రాన్సిస్, జీటా, 1070 సంవత్సరాల నాటి ప్రణవకోన యువరాజు కంగువా (సూర్య)కి మధ్య సంబంధం ఏమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమాపై ఓ లుక్కేయాల్సిందే!

అజిత్ స్పీడ్‌కు హాలీవుడ్ బ్రేక్

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. మగిజ్ తిరుమేని దర్శకత్వంలో తెరక్కుతున్న సినిమా 'విదాముయార్చి'. 62గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో త్రిష కృష్ణన్ హీరోయిన్. ఈ సినిమాను లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో ఆరవ్, అర్జున్, రెజీనా, సంజయ్ దత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా టీజర్ రిలీజైన విషయం తెలిసిందే. దీనికి మంచి స్పందన కూడా వచ్చింది. ఇక సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకి తీసుకురావడమే బాకీ అనుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ హాలీవుడ్ నిర్మాణ సంస్థ మేకర్స్ కి ఝలక్ ఇచ్చింది. ఇంతకీ ఏమైందంటే.. కోలీవుడ్ టాప్ హీరో అజిత్ కుమార్ లేటెస్ట్ ఫిల్మ్ 'విదాముయార్చి' సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకి వచ్చేందుకు సిద్ధమైంది. అయితే ఈ సినిమా హాలీవుడ్ మూవీ 'బ్రేక్ డౌన్'కి కాపీ అంటూ ఆ సినిమా ప్రొడ్యూసర్స్ లీగల్ పోరుకు సిద్ధమయ్యారు. దీంతో ఈ సినిమా విడుదలపై సందిగ్ధం ఏర్పడింది. ఒరిజినల్ మేకర్స్ నుండి ఎలాంటి పర్మిషన్స్ తీసుకోకుండా లైకా సంస్థ ఈ సినిమాని తెరకెక్కించడంపై పారామౌంట్ నిర్మాణ సంస్థ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక ఈ సినిమా టీజర్‌ను గమనిస్తే.. హీరో అజిత్ కుమార్ డిఫరెంట్ అవతార్‌లో కనిపిస్తున్నారు. ప్రపంచమంతా నిన్ను నమ్మకపోయినా పరవాలేదు.. నిన్ను నువ్వు నమ్ముకో.. అనే కాన్సెప్ట్‌తో యాక్షన్ బేస్డ్ మూవీగా ఈ సినిమా తెరకెక్కినట్లుగా ఈ టీజర్ చూస్తుంటే తెలుస్తోంది. అజిత్ దేని కోసమో అన్వేషిస్తూ.. అడ్డువచ్చిన విలన్స్ భరతం పడుతూ.. తాను సాధించాల్సిన లక్ష్యం కోసం ఏం చేయటానికైనా, ఎంత దూరం వెళ్లటానికైనా, ఎవరినైనా ఎదిరించేలా ఇప్పటి వరకు కనిపించని ఓ వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తున్నారు.

తేలిపోయిన టీమిండియా

విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆడుకున్న నితీష్ కుమార్ రెడ్డి

భారీ స్కోరు దిశగా ఆస్ట్రేలియా..

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో అడిలైడ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా తొలి రోజు తేలిపోయింది. మొదట బ్యాటింగ్ లో విఫలమైన భారత్.. ఆ తర్వాత బౌలింగ్ లో కూడా పస చూపలేకపోయింది. దాంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ లో 33 ఓవర్లలో వికెట్ నష్టపోయి 86 పరుగులు చేసింది. ప్రస్తుతం మరో 94 పరుగులు వెనుకబడి ఉంది. మార్నస్ లబుషేన్ (67 బంతుల్లో 20 నాటౌట్‌బీ 3 ఫోర్లు), నాథన్ మెక్ స్వీని (97 బంతుల్లో 38 నాటౌట్‌బీ 6 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. వీరిద్దరు అజేయమైన రెండో వికెట్ కు 62 పరుగులు జోడించారు. ఉస్మాన్ ఖవాజ (13) వికెట్ ను భారత బౌలర్లు సాధించారు. అంతకుముందు టీమిండియా బ్యాటర్లు తేలిపోయారు. మరోసారి తెలుగు తేజం, యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి(54 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 42) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆదుకోవడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు చేయగలిగింది.నితీష్ కుమార్ రెడ్డితో పాటు కేఎల్ రాహుల్(64 బంతుల్లో 6 ఫోర్లతో 37), శుభ్‌మన్ గిల్(51 బంతుల్లో 5 ఫోర్లతో 31) పర్వాలేదనిపించారు. విరాట్ కోహ్లీ(7), రోహిత్ శర్మ(3) దారుణంగా విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/48) ఆరు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ప్యాట్ కమిన్స్, స్కాట్ బోలాండ్ రెండేసి వికెట్లు తీసారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. మిచెల్ స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ ఫస్ట్ బాల్‌కే యశస్వి జైస్వాల్ ఎల్బీగా వెనుదిరిగాడు. దాంతో భారత్ పరుగుల ఖాతా తెరవకుండానే వికెట్ కోల్పోయింది. క్రీజులోకి వచ్చిన శుభ్‌మన్ గిల్‌తో కలిసి మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ ఆచితూచి ఆడాడు. మంచి బంతులను గౌరవించిన ఈ జోడీ చెడ్డవాటిని బౌండరీలకు తరలించింది. 69 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని మిచెల్ స్టార్క్ విడదీసాడు. హాఫ్ సెంచరీకి చేరువైన రాహుల్(37)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే క్రీజులోకి వచ్చిన కోహ్లీ(7) కూడా స్టార్క్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆ మరుసటి ఓవర్‌లోనే నిలకడగా ఆడుతున్న శుభ్‌మన్ గిల్(31)ను స్కాట్ బోలాండ్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. దాంతో భారత్ 82/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే రోహిత్ శర్మ(3)ను స్కాట్ బోలాండ్.. ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. నిలకడగా ఆడుతున్న రిషభ్ పంత్‌ను కమిన్స్ క్యాచ్ ఔట్ చేశాడు. దాంతో భారత్ 109 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో నితీష్ కుమార్ రెడ్డి, రవిచంద్రన్ అశ్విన్ దూకుడుగా ఆడారు. ముఖ్యంగా అశ్విన్.. 100 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేశాడు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని స్టార్క్ విడదీసాడు. అశ్విన్(22)ను వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. అదే ఓవర్‌లో క్రీజులోకి వచ్చిన హర్షిత్ రాణా(0)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. బుమ్రాతో కలిసి నితీష్ కుమార్ రెడ్డి దూకుడుగా ఆడాడు. ట్రేడ్ మార్క్ షాట్స్‌తో అలరించాడు. స్విచ్ హిట్, రివర్స్ స్వీప్, కవర్ డ్రైవ్‌లతో బౌండరీలు రాబట్టాడు. బుమ్రాను కమిన్స్ ఔట్ చేయగా.. దూకుడుగా ఆడే క్రమంలో స్టార్క్ బౌలింగ్‌లో నితీష్ క్యాచ్ ఔటయ్యాడు. దాంతో భారత తొలి ఇన్నింగ్స్‌కు తెరపడింది. పెర్త్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో నితీష్ ఇలానే దూకుడుగా ఆడి భారత్‌కు మెరుగైన స్కోర్ అందించాడు.

చరిత్ర సృష్టించిన మిచెల్ స్టార్క్

అడిలైడ్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న డే/నైట్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 44.1 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ కుమార్ రెడ్డి (42బీ 54 బంతుల్లో, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్. కేఎల్ రాహుల్ (37బీ 64 బంతుల్లో, 6 ఫోర్లు), శుభ్‌మన్ గిల్ (31బీ 51 బంతుల్లో, 5 ఫోర్లు), రవిచంద్రన్ అశ్విన్ (22బీ 22 బంతుల్లో, 3 ఫోర్లు), రిషభ్ పంత్ (21బీ 35 బంతుల్లో, 2 ఫోర్లు) రాణించారు. మిగిలిన బ్యాటర్లూ ఎవరూ రెండంకెల స్కోరు అందుకోలేకపోయారు. యశస్వీ జైస్వాల్, హర్షిత్ రాణా, జస్‌ప్రీత్ బుమ్రా డకౌటయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ (6/48) ఆరు వికెట్లతో విజృంభించాడు. ప్యాట్ కమిన్స్ (2/41), స్కాట్ బొలాండ్ (2/54) చెరో రెండు వికెట్లు తీశారు. అయితే ప్రధాన బ్యాటర్లు వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టిన స్టార్క్ అరుదైన ఘనత సాధించాడు. పింక్ బాల్ టెస్టుల్లో అయిదు వికెట్ల ఘనతను నాలుగు సార్లు సాధించిన ఏకైక బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు.డే/నైట్ టెస్టుల్లో ఓ ఇన్నింగ్స్‌లో ఏ బౌలర్ రెండు కంటే ఎక్కువ సార్లు అయిదు వికెట్లను సాధించలేకపోయాడు. కానీ స్టార్క్ ఏకంగా నాలుగు సార్లు ఈ ఘనత సాధించాడు. కాగా, భారత్‌పై ఓ ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్లు పడగొట్టడం స్టార్క్‌కు ఇదే తొలిసారి. కాగా, స్టార్క్ ఓవరాల్‌గా తన టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. 14.1 ఓవర్లు బౌలింగ్ చేసిన స్టార్క్ 48 పరుగులే ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు 2016లో శ్రీలంకపై 50 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టిన రికార్డు తన అత్యుత్తమంగా ఉండేది.

ఆసియా కప్ 2024లో ఫైనల్‌కు భారత్

ఫైనల్లో బంగ్లాదేశ్‌తో పోరు

అండర్ 19 ఆసియా కప్ 2024 టోర్నీ భారత యువ జట్టు ఫైనల్ చేరింది. శ్రీలంక అండర్ 19 జట్టుతో శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో భారత అండర్ 19 జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టీమిండియా యువ సెన్సేషన్, 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ(36 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 67) మరోసారి విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 46.2 ఓవర్లలో 173 పరుగులకు కుప్పకూలింది. శ్రీలంక బ్యాటర్లలోలాక్విన్ అబే సింఘే(110 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 69) హాఫ్ సెంచరీతో రాణించగా.. శారుజన్ షణ్ముగనాథన్(78 బంతుల్లో 2 ఫోర్లతో 42) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో చేతన్ శర్మ(3/34) మూడు వికెట్లు తీయగా.. కిరణ్, ఆయుష్ మాత్రే రెండేసి వికెట్లు పడగొట్టారు. యుధజిత్ గుహ, హార్దిక్ రాజ్‌కు చెరో వికెట్ దక్కింది. అనంతరం భారత అండర్ 19 జట్టు 21.4 ఓవర్లలోనే 3 వికెట్లకు 175 పరుగులు చేసి 170 బంతులు మిగిలి ఉండగానే విజయాన్నందుకుంది. వైభవ్ సూర్యవంశీతో పాటు ఆయుష్ మాత్రే(28 బంతుల్లో 7 ఫోర్లతో 34) రాణించాడు. కెప్టెన్ మహమ్మద్ అమాన్(26 బంతుల్లో 2 ఫోర్లతో 25 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. శ్రీలంక బౌలర్లలో విహాస్, విరన్, ప్రవీణ్ తలో వికెట్ తీసారు. 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మరోసారి 5 సిక్సర్లతో అలరించాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ. 1.10 కోట్లు పలికి అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ.. ఈ టోర్నీ తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్‌లో ఒక్క పరుగే చేసిన ఈ చోటా సూరీడు.. జపాన్‌తో 23 పరుగులకే వెనుదిరిగాడు. యూఏఈతో జరిగిన మూడో మ్యాచ్‌లో మాత్రం తన అసలు సిసలు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 46 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లతో 76 పరుగులతో అజేయంగా నిలిచాడు. శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్లో అదే

మరోసారి తన బలహీనతను బయటపెట్టిన కోహ్లీ

ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా జరుగుతున్న పింక్ బాల్ టెస్ట్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(7) తీవ్రంగా నిరాశపరిచాడు. మరోసారి తన బలహీనతను బయటపెట్టిన కోహ్లీ.. స్లిప్‌లో స్టీవ్ స్మిత్‌కు సునాయస క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ దెలివరీని వెంటాడి మూల్యం చెల్లించుకున్నాడు. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో సెంచరీతో ఆకట్టుకున్న కోహ్లీ..పింక్ బాల్ టెస్ట్‌లో మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. విరాట్ కోహ్లీ ఔటవ్వడంపై టీమిండియా మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బాల్స్ ఆడటంలో కోహ్లీ ఇబ్బంది పడుతున్నాడని, ఈ బలహీనతను అధిగమించేందుకు కూడా ప్రయత్నించడం లేదని పేర్కొన్నాడు. ఈ బలహీనత కారణంగానే టెస్ట్‌ల్లో కోహ్లీ యావరేజ్ తగ్గిందని అభిప్రాయపడ్డాడు. 'విరాట్ కోహ్లీ బ్యాటింగ్ యావరేజ్ దిగజారడానికి ప్రధాన కారణం ఒకటి ఉంది. అంతకుముందు 50 ప్లస్ ఉండే అతని యావరేజ్ 48కి పడిపోయింది. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ దెలివరీలను ఆడే బలహీనత కోహ్లీని వెంటాడుతోంది. మరీ ముఖ్యంగా.. ఆ బలహీనత నుంచి బయటపడేందుకు కూడా కోహ్లీ ప్రయత్నించకపోవడం అతని మొండితనంలా అనిపిస్తోంది.'అని మంజ్రేకర్ ట్వీట్ చేశాడు. విరాట్ కోహ్లీ టెస్ట్ గణంకాలకు సంబంధించిన పోస్ట్‌లు కూడా నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఏడాది కోహ్లీ ఒక సెంచరీతో పాటు హాఫ్ సెంచరీ మాత్రమే చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకు ఆలౌటైంది. యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి(54 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 42) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆదుకోవడంతో భారత్ గౌరవప్రదమైన స్కోర్ చేయగలిగింది. కేఎల్ రాహుల్(64 బంతుల్లో 6 ఫోర్లతో 37), శుభ్‌మన్ గిల్(51 బంతుల్లో 5 ఫోర్లతో 31) పర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/48) ఆరు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు.

జట్టును తప్పుగా అర్థం చేసుకున్నారు: కమిన్స్

ఆస్ట్రేలియా క్రికెట్ జట్టులో చీలిక పుకార్లపై వస్తున్న వార్తలపై కెప్టెన్ పాట్ కమిన్స్ స్పష్టతనిచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆ పుకార్లలో ఏ మాత్రం నిజం లేదని, జట్టు చుట్టూ ఉన్న పరిసరాలు అద్భుతంగా ఉన్నాయని తెలిపారు.పెర్త్ టెస్టులో 3వ రోజు అనుభవజ్ఞుడైన పేసర్ జోష్ హాజిల్‌వుడ్ చేసిన ఒక వ్యాఖ్య కారణంగా ఆస్ట్రేలియా డ్రెస్సింగ్ రూమ్‌లో విభజన ఉందన్న ఊహాగానాలు మొదలయ్యాయి. హాజిల్‌వుడ్ మాట్లాడుతూ, "బ్యాటర్‌లలో ఎవరికైనా ఆ ప్రశ్న అడగండి. నేను ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాను. ఫిజియోతో కొన్ని చికిత్సలు చేసుకుంటున్నాను. తదుపరి టెస్టుపై దృష్టి పెట్టాను," అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన కమిన్స్, "జట్టు చాలా బాగా ఉంది. కొంతమంది కామెంటేటర్లు జట్టును తప్పుగా అర్థం చేసుకున్నారు. టీమ్ అందరి మద్దతుతో పటిష్టంగా ఉంది. జట్టులో ఏ విభజన లేదని స్పష్టం చేస్తున్నాను," అని అన్నారు.భారత జట్టుతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మొదటి టెస్టులో, ఆస్ట్రేలియా తక్కువ స్కోరుకే ఆలౌటైనప్పటికీ, భారత్ విజృంభించి 295 పరుగుల తేడాతో విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో, రెండో టెస్టుకు ఆస్ట్రేలియా పేసర్ జోష్ హాజిల్‌వుడ్ గాయం కారణంగా ఆడలేకపోతుండటంతో, స్కాట్ బోలాండ్‌ను జట్టులో చేర్చారు.

వార్నర్ స్పెషల్ రిప్లై

సోషల్ మీడియాలో తమ అభిమాన క్రికెటర్ నుండి ప్రతిస్పందన కోసం కొన్ని రోజులపాటు నిరీక్షించటం అభిమానులకు కొత్తేమీ కాదు. కానీ, కొంతమంది అభిమానులు తమ తపనను ట్వీట్ల రూపంలో ప్రదర్శించి, వారి లక్ష్యాన్ని సాధిస్తారు. ఇటీవలి ఘటనలో, దేవిడ్ వార్నర్ రిప్లై ఒక భారతీయ అభిమాని కోరికను తీర్చడం అందరినీ ఆకర్షించింది. ఐపీఎల్ 2025 వేలంలో దేవిడ్ వార్నర్ అమ్ముడుపోకపోవడం అభిమానులకు పెద్ద షాక్ ఇచ్చింది. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన వార్నర్, ఐపీఎల్‌లో అద్భుతమైన ఫామ్ కలిగిన ఆటగాడు. కానీ ఈసారి వేలంలో అతనికి ఎవరూ కొనుగోలు చెయ్యకపోవడం అందరికి ఆశ్చర్యం కలిగించింది. అయితే, ఆస్ట్రేలియన్ స్టార్ క్రికెటర్‌పై అభిమానులు చూపే ప్రేమ ఏమాత్రం తగ్గలేదు. తన అభిమాన క్రికెటర్ డేవిడ్ వార్నర్ నుండి రిప్లై రావడానికి ప్రయత్నిస్తున్న %జతీఅఎఇుయ%బి45 అనే ట్విట్టర్ వినియోగదారు, వార్నర్‌ను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు: అన్ని ఫార్మాట్లలో అత్యుత్తమ ఓపెనర్లలో ఒకరురిప్లై ఇచ్చే వరకు ట్వీట్ చేస్తూనే ఉంటాను??" అని ప్రకటించారు. అందరినీ ఆశ్చర్యపరుస్తూ, దేవిడ్ వార్నర్ వెంటనే ప్రతిస్పందిస్తూ, "హాయ్" అంటూ తన అభిమానిని ఆనందపరిచాడు. ఈ సరళమైన స్పందనతో అభిమాని సంతోషంతో చిందులు వేసాడు. వార్నర్ రిప్లై సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నెటిజన్లు తమ అభిప్రాయాలతో స్పందించి, కామెంట్ల విభాగాన్ని నింపేశారు. కొంతమంది వార్నర్‌ను "అత్యుత్తమ ఓపెనర్"గా కొనియాడగా, మరికొందరు ఐపీఎల్‌లో అతని గైర్హాజరీని చర్చించారు. కొందరు అయితే, "పుష్ప 2cలో అల్లు అర్జున్‌తో కలిసి అతిథి పాత్రలో కనిపిస్తాడనే పుకార్లను కూడా ప్రస్తావించారు.ఇదీ తొలిసారి కాదు, దేవిడ్ వార్నర్ ఈ తరహా స్పందనల ద్వారా తన అభిమానుల గుండెల్లో చోటు సంపాదించుకున్నాడు. గతంలో కూడా అతను 23 రోజులపాటు ఎదురు చూసిన ఓ అభిమాని ట్వీట్‌కు స్పందించి, అభిమానుల మన్ననలు పొందాడు. ప్రస్తుతం భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024-25లో రెండో టెస్ట్ అడిలైడ్‌లో పింక్-బాల్‌తో జరగనుంది. పింక్ బంతి టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో దేవిడ్ వార్నర్ ఒకరు. 17 ఇన్నింగ్స్‌లో 47.06 సగటుతో 753 పరుగులు చేసిన వార్నర్ ఈ ఫార్మాట్‌లో తన ప్రత్యేకతను నిరూపించాడు.వార్నర్ తన ఆటతీరుతోనే కాకుండా, తన అభిమానులందరికీ ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించడంలో కూడా మాస్టర్. "హాయ్" అన్న చిన్న మాటతోనే ఆయన తమ అభిమాన గుండెల్లో చిరస్మరణీయుడై నిలుస్తాడు.

సమస్యల 'గుర్రు'కులాలు

తెలంగాణ రాష్ట్రం విద్యారంగంలో ముందడుగు వేయాలనే లక్ష్యంతో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసింది. సామాజిక వర్గాల అభ్యున్నతికి ముఖ్యమైన ఈ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత వంటి ప్రాథమిక అంశాల్లో నిర్లక్ష్యం కనిపించడం గుండెను తట్టడం వంటిదే. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శైలజ అనే విద్యార్థిని ఆహార విషపూరితానికి గురై మరణించటం తీవ్ర ఆందోళన కలిగించింది. శైలజ మరణం విషయంలో అధికారులు నిర్లక్ష్యం చూపారని ఆరోపణలు వస్తున్నాయి.

- సుమంత్ పెండెం

ఏబీవీపీ క్షేత్ర నాయకుడు,

హైదరాబాద్ సెంట్రల్

యూనివర్సిటీ

పాఠశాలల్లో అందించే ఆహారం అతి స్థాయి నాణ్యతతో ఉండాల్సింది పోయి, విషపూరిత ఆహారం విద్యార్థుల ప్రాణాలను దెబ్బతీస్తోంది. శైలజ వంటి ప్రతిభావంతులైన విద్యార్థుల మరణాలు, గురుకుల పాఠశాలల యాజమాన్య విధానాలపై మరింత ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. మొత్తంగా 51 మంది విద్యార్థులు చనిపోవడం దారుణం. ఈ సమస్య కాంగ్రెస్ పాలనతో మొదలైనది కాదు. టీఆర్ఎస్ హయాంలోనూ పాఠశాలల్లో ఆహార నాణ్యతపై అనేకమార్లు ఫిర్యాదులు వచ్చాయి. 2019లోనూ ఈ తరహా సమస్యలు వెలుగులోకి వచ్చాయి, కానీ పెద్దగా చర్యలు తీసుకోలేదని ఆ సమయంలో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే మార్గాన్ని అనుసరిస్తూ నిర్లక్ష్యంతో వ్యవహరించడం దురదృష్టకరం.

ఆహార నాణ్యతపై జాగ్రత్తలు ఎక్కడ?

గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతకు సంబంధించి ప్రతి పాఠశాల నిర్వాహణలో కనీస పర్యవేక్షణ లేకపోవడం ప్రధాన సమస్యగా కనిపిస్తోంది. ఫుడ్ కాంట్రాక్టులు నిర్లక్ష్యంగా ఇచ్చి, సరైన తనిఖీ లేకుండా ఆహారాన్ని అందించడమే ప్రమాదానికి కారణమవుతోంది. విషపూరిత పదార్థాల వినియోగం విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారింది. ఈ ఘటనలపై విద్యార్థి సంఘాలు ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆహార నాణ్యతను మెరుగుపరచడమే కాకుండా, పాఠశాల యాజమాన్య వ్యవస్థపై పునఃసమీక్ష జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమస్యలను పట్టించుకోకపోవడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భద్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే అభిప్రాయం ప్రజల్లో వస్తోంది. టీఆర్ఎస్ హయాంలోనూ, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ ఈ నిర్లక్ష్యం మారకపోవడం భవిష్యత్ తరాలకు ప్రమాదకరంగా మారుతోంది. గురుకుల పాఠశాలలు విద్యార్థులకు భవిష్యత్ కోసం పునాది వేయాల్సిన చోటుగా ఉండాలి. కానీ ఆహార విషపూరిత ఘటనలు, శైలజ మరణం వంటి సంఘటనలు ఈ పాఠశాలల లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ పరిస్థితులు మారాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణ చర్యలు తీసుకోవాలి. ఆహార నాణ్యతపై కఠిన నియంత్రణలు అమలు చేసి, పాఠశాలలను విద్యార్థులకు నిజమైన భద్రత కలిగిన ప్రదేశాలుగా మార్చడం అవసరం.

అవసరమైన చర్యలు

ఆహార నాణ్యత తనిఖీ: ప్రతి పాఠశాలలో ఫుడ్ క్వాలిటీ తనిఖీలను నిరంతరంగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలి. పౌష్టికాహార మెనూ: విద్యార్థులకు శారీరక, మానసిక అభివృద్ధి కల్పించేందుకు పౌష్టికాహారం అందించడం నిర్బంధం కావాలి. బాధ్యులపై చర్యలు: గతంలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ: రెగ్యులర్ హెల్త్ చెకప్ క్యాంపులు నిర్వహించి, సమస్యలను ముందుగానే గుర్తించాలి. పిల్లల తల్లిదండ్రులతో కమ్యూనికేషన్: ప్రతి సమస్యకు సంబంధించి తల్లిదండ్రులను అప్రమత్తం చేసి, వారికి పూర్తి సమాచారం అందించాలి.

అభ్యసనం

ప్రతి జీవికి పుట్టుకతో కొన్ని ప్రత్యేక శక్తులు ఉంటాయి. ఆ లక్షణాలు జీవితంలో ఎదగటానికి సరిపోవు. ఎదిగేకొద్దీ ఒక్కో పనిని నేర్చుకుంటూ, ఆ లక్షణాలను అలవర్చుకోవడమే అభ్యసనం.

జీవి పరిపక్వత చెందితే, అనుభవం గడిస్తే జీవితాల్లో మార్పులు వస్తాయి. అందులో అనుభవం వల్ల వచ్చేదాన్నే అభ్యసనం అంటాం. విద్యార్థులకు చదువు అనేది అభ్యసనం. ఎంత నేర్చుకుంటే అంత అనుభవం. ఎంత అనుభవం సాధిస్తే జీవితంలో అంత గొప్ప ఎదుగుదల కనిపిస్తుంది. అభ్యసనం అనేది నిరంతర ప్రక్రియ అన్న సంగతి తెలుసుకోవాలి. ఇది సార్వత్రికమైనది. గతిశీలమైనది. దీనికి సంచిత స్వభావం ఎక్కువ. అయితే, గమ్యాన్ని నిర్దేశించేది. అవసరం.. అవసరం నుంచి ప్రేరణ పొంది అవరోధాలను అధిగమించడం.. ఇదే అభ్యసనం. చివరికి చేరేది గమ్యమే. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. అభ్యసనం ఒక ప్రక్రియ మాత్రమే. దాన్నే ఫలితంగా భావించకూడదు. విద్యార్థులు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయాల్లో ఇదే ప్రధానం.

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..
సంస్కృతిని కాపాడే లక్ష్యంగా..
మన ఔన్నత్యాన్ని పెంచేలా..
మన ఔచిత్యాన్ని చాటేలా..
తెలుగు చరిత్రలోనే తొలిసారి..
ధర్మం కోసం అక్షర తపస్సు చేస్తూ..
తెలుగు ప్రజల కోసం వస్తున్నది..

"ఋషి తెలుగు దినపత్రిక"

'కురుక్షేత్రం' అన్న పేరుతో..
సంపాదకీయాన్ని తీసుకొస్తున్నది
ఆసక్తి కలిగిన రచయితలు..
ధర్మ పరిరక్షకులు..
ఈ అక్షర యజ్ఞంలో
పాలుపంచుకోవాలని విజ్ఞప్తి.
కురుక్షేత్రం పేజీ కోసం తమ
వ్యాసాలు పంపి
మరింత మందికి జ్ఞానాన్ని
ప్రసాదించాలని వినతి.

కాపాడుకుందాం
మన దేశాన్ని!
మన ధర్మాన్ని!!

గురుకులం అంటే..

బడికి వెళ్లటం.. పుస్తకాల్లోంచి చదువు కోవటం.. పరీక్షలు రాయటం.. ఇంటికి రావటం. ఇదేనా చదువంటే? ప్రాచీన భారతదేశంలో చదువుల ఆలయాలైన గురుకులాలు ఎలా ఉండేవి? ఇప్పటిలానే ఉండేవా? ఇదే రొడ్డకొట్టుడు వ్యవహారాలు సాగేవా? అంటే.. ప్రాచీన భారతీయ విద్యావిధానానికి నేటి విద్యావిధానం చాలా దూరంగా ఉందని చెప్పాలి. గురుకులం అనే పదం.. 'గురు' అంటే గురువు, 'కుల' అంటే కుటుంబం లేదా ఇల్లు అనే పదాల నుంచి ఉద్భవించింది.

గురుకుల వ్యవస్థ అనువర్తిత జ్ఞానం, క్రమశిక్షణ, కృషిని నొక్కి చెప్పింది. వృత్తిపరమైన, సామాజిక, మతపరమైన, ఆధ్యాత్మిక విద్యను అందజేసింది. అంటే.. సంపూర్ణ అభ్యాసాన్ని గురుకులాలు నొక్కిచెప్పాయి. గురుకులాలు సుమారు 5000 సంవత్సరాల క్రితం ఉద్భవించాయి. వేద కాలంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి. గురుకులాలలో విద్యార్థుల ప్రవేశం వారి కులాల ఆధారంగా మారుతూ ఉంటుంది. గురుకుల వ్యవస్థ పుస్తకాల నుంచి కఠినమైన సిలబస్‌ను అనుసరించలేదు. గురువులు ప్రతి విద్యార్థిని గమనించి, వారి అవగాహన, సామర్థ్యాల ఆధారంగా పాఠాలను రూపొందించారు. విద్యార్థులకు సంస్కృతం, వ్యాకరణం, ఖగోళశాస్త్రం, గణితం, ఆయుర్వేదం (వైద్యం), దర్శనం (తత్వ శాస్త్రం), రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం (ఆర్థికశాస్త్రం, రాజకీయ శాస్త్రం, పరిపాలన), యోగా (మతం) మరియు ధనుర్వేదం (యుద్ధం) వంటి అనేక రకాల విషయాలను బోధించారు. ఏదైనా ఒకరోజు గురుకులాలను శుభ్రం చేయటం, వంట చేయడం, శారీరక దృఢత్వం వంటి పనులను విద్యార్థులు చేపట్టారు. అయితే, 1858లో థామస్ బాబింగ్టన్ మెకాలే (లార్డ్ మెకాలే అని కూడా పిలుస్తారు) ద్వారా కొత్త భారతీయ విద్యా చట్టం అమల్లోకి వచ్చింది. ఇది గురుకుల వ్యవస్థను నిషేధించింది. భారతదేశంలో పాశ్చాత్య తరహా పాఠశాలలు. విద్యకు ఎక్కువ ప్రాధాన్యం పెంచింది. దాంతో విద్యావ్యవస్థలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం పాఠశాల అంటే పుస్తకం.. బట్టీ అన్నట్లుగానే మారిపోయింది.

- బీ.గంగాధర్

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #11-5-419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 6-1-628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD-4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com